ప్రజాశక్తి

సోమవారం 26 మే 2024 **12** పేజీలు

తిరుపతి



ఎస్వీయూలో పడకేసిన పారిశుధ్యం

- ఏరులై పారుతున్న మురుగు నీరు
- పట్టించుకోని అధికారులు
- అవస్థలు పడుతున్న విద్యార్థులు
- పురుగులు, దోమలకు నిలయంగా మారిన క్యాంపస్



ప్రజాశక్తి - క్యాంపస్

శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో గత పాలకుల పుణ్యమా అని పారిశుధ్యం పడకేసింది. ప్రపంచంలోనే ఎంతో పేరు ప్రఖ్యాతని శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయంలో నిత్యం ఎంతో మంది విద్యార్థులు, అధ్యాపకులు, ఇతర సిబ్బంది సంచరిస్తూ ఉంటారు. అటువంటి ప్రాంతమైన శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో మొదటి గేటు దగ్గర నుంచి హెచ్ బ్లాక్ వరకు వివిధ మెస్సులలో వచ్చే చెత్తాచెదారం, డ్రైనేజీ వాటర్ డి బ్లాక్ మెస్సు పక్కన ఏరులై పారుతూ ఉండడం విడ్డూరంగా ఉంది. దాదాపుగా రెండు సంవత్సరాలు కాలంగా ఈ మురుగునీరును పరిశుభ్రం చేద్దామని ఆలోచన ఉన్నతాధికారులకు కానీ, సంబంధిత అధికారులకు కానీ రాకపోవడం శోచనీయం. అంతేకాకుండా ప్రపంచంలోనే తలమానికంగా గుర్తింపు సాధించిన ఎస్వీయూ ఇంజనీరింగ్ కళాశాల పరిసర ప్రాంతాలు కూడా ఎంతో అపరిశుభ్రంగా ఉన్నాయి ముఖ్యంగా ఇంజనీరింగ్ కళాశాల గేటు, నాలుగో గేటు ప్రాంతంలో ఇంజనీరింగ్ కళాశాల బాలుర వసతి గృహాల నుంచి వచ్చే మురుగునీరు ఇతర డ్రైనేజీ వేస్టేజెస్ విచ్చలవిడిగా ఏరులై

2లో



బ్రహ్మోత్సవాలకు 8 ప్రథమ చికిత్స కేంద్రాలు

ప్రజాశక్తి- తిరుమల: శ్రీవారి బ్రహ్మోత్సవాల సమయంలో తిరుమలకు వచ్చే లక్షలాదిమంది భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా టీటీడీ వైద్య విభాగం అధికారులు చర్యలు తీసుకున్నారు. తిరుమలలో వేర్వేరు ప్రాంతాల్లో ఎనిమిది ప్రథమ చికిత్స కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. నారాయణగిరి ఉద్యానవనాల్లో రెండు, రాంబగీచ అతిథి గృహాలు, మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ అన్న ప్రసాద కేంద్రం, శిలా తోరణం, బాట గంగమ్మ ఆలయం, పాపవినాశనం, 7వ మైలు వద్ద ఒక్కొక్కటి చొప్పున తాత్కాలిక ప్రథమ చికిత్స కేంద్రాలను నెలకొల్పబోతున్నట్లు వెల్లడించారు. ప్రస్తుతం తిరుమల, తిరుపతిల్లో శాశ్వతంగా టీటీడీకి చెందిన ఆరు చొప్పున డిస్పెన్సరీలు, ప్రథమ చికిత్స కేంద్రాలు భక్తులకు అందుబాటులో ఉన్నాయి. బ్రహ్మోత్సవాలను దృష్టిలో పెట్టుకుని అదనంగా మరో ఎనిమిది హెల్త్ సెంటర్లను ఏర్పాటు చేయనున్నారు. డాక్టర్లు, పారామెడికల్ సిబ్బంది, మందులు, అత్యాధునిక వైద్య పరికరాలతో కూడిన అంబులెన్స్‌లను సిద్ధం చేస్తున్నారు.



(మొదటి పేజీ తరువాయి)

ఎస్వీయూలో పడకేసిన పారిశుధ్యం

పారుతుండడం జరుగుతుంది. ఇంతవరకు వర్సిటీ సంబంధిత అధికారులు దీనిని గుర్తించకపోవడం చాలా బాధాకరం. అపరిశుభ్రమైన వాతావరణ పరిస్థితుల్లో విద్యార్థులు దోమలు, ఈగలు, ఇతర బ్యాక్టీరియాలు చేరడం ద్వారా ఎంతో మంది అనారోగ్యానికి గురై అవకాశం కూడా ఉంది. ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజనీర్స్ భవనం ఎదురుగా ఇంజనీరింగ్ కళాశాల పరిసర ప్రాంతాల్లో ఏరై నీరులై పారుతున్న మురుగునీరు ప్రాంతంలో అడవి పందులు సంచరిస్తుండడం, కొంతమంది బయట వ్యక్తులు వర్సిటీలో పందుల పెంపకానికి కూడా గతంలో ప్రారంభించడం జరిగింది. దీనిపై ఉన్నతాధికారులు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం హాస్యాస్పదం.

గత పాలకుల పరిపాలన శాపం ఏమో విద్యార్థుల పాలిట పరీక్ష ఫలితాలలో కానీ, సర్టిఫికెట్లను సకాలంలో అందించడంలో గాని పూర్తిగా విఫలమైంది పరీక్షల విభాగం. విద్యార్థులు అనారోగ్య సమస్యలతో ఆసుపత్రికి వెళితే అక్కడ సరైన మందులు లేవు, సరికద శాశ్వతమైన డాక్టర్లు, సిబ్బంది లేకపోవడం మరొక బాధాకరమైన అంశం. వర్సిటీలో పరిశుభ్రత పచ్చదనం అనే కార్యక్రమాలు గతంలో పాలకులు కార్యక్రమాలు నిర్వహించారు ఫోటోలకు ఫోజులు ఇచ్చి, మొక్కలను నాటారు. కానీ పరిశుభ్రత మరిచారు, మొక్కలను బతికించడం మరిచారు. కేవలం పేపర్లలో ఫోటోలకు ఫోజులు ఇవ్వడానికి ఈ కార్యక్రమాన్ని చేశారని, కొంతమంది ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్లు, ఇతర అకడమిక్ కోఆర్డినేటర్లు వారి కార్యక్రమాలు బిల్లుల కోసమే ఇవి నిర్వహించారని వర్సిటీలో చర్చ నడుస్తోంది. ఇప్పటికైనా ప్రభుత్వం మారిన తర్వాత కూడా కొన్ని విభాగాల్లో అధికారులు ఇప్పటికీ మొద్దు నిద్రపోవడం విడ్డూరంగా ఉంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు దీన్ని గుర్తించి అన్ని విభాగాల అధికారులతో సమన్వయంతో వర్సిటీలో పచ్చదనం పరిశుభ్రతను పూర్తిస్థాయిలో చేయాలని విద్యార్థి సంఘాల నేతలు, సంబంధిత కళాశాల ఆచార్యులు, విద్యార్థులు, పరిశోధకులు కోరుతున్నారు.

మెడికల్ క్యాంపు విజయవంతం



ప్రజాశక్తి- తిరుపతి టౌన్

తిరుపతి కరకంబాడీ రోడ్డులోని వినాయకసాగర్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సంకల్ప హాస్పిటల్స్, వాసన్ ఐ కేర్ సంయుక్తంగా వాకర్స్‌కు మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వాకర్స్ ఇంటర్నేషనల్ మాజీ గవర్నర్, జనసేన నాయకులు ఆర్కాట్ కృష్ణప్రసాద్, ప్రముఖ గుండె వైద్యనిపుణులు, సంకల్ప హాస్పిటల్స్ డైరెక్టర్ నాగరాజు, సంకల్ప డైరెక్టర్ బండ్ల సోమేశ్వర్ విచ్చేసారు. ఈ సందర్భంగా ఆర్కాట్ కృష్ణప్రసాద్ మాట్లాడుతూ నడక వల్ల నడత కూడా అలవాటువవుతుందని తద్వారా ఆరోగ్యంగా ఉండవచ్చునని తెలిపారు. వాకర్స్ అస్సోసియేషన్స్ ద్వారా ఉచితంగా మెడికల్ క్యాంపు నిర్వహించి ఆరోగ్య సలహాలు సూచనలు చేయడం ఆనందంగా ఉందని పేర్కొన్నారు. డాక్టర్ నాగరాజా మాట్లాడుతూ నడక వలన గుండె బలవంతంగా తయారువుతుందని, ధూమపానం, మద్యపానం వంటి వ్యసనాలకు దూరంగా ఉండాలని తెలిపారు. సంకల్ప డైరెక్టర్ బండ్ల సోమేశ్వర్ మాట్లాడుతూ వాకర్స్‌కు తమ హాస్పిటల్‌లో ట్రీట్మెంట్ వచ్చిన వాకర్స్‌కు రాయితీ ఇస్తున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో బాలాజీ నాయుడు, శివరెడ్డి, కృష్ణంరాజు, వి.జగన్నాధం, నరసింహయ్య, యోగ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

స్వయం సహాయక సంఘాల్లోని

మహిళలందరూ లక్షాధికారులు కావాలి : కలెక్టర్



ప్రజాశక్తి- తిరుపతి టౌన్

జిల్లాలోని స్వయం సహాయక సంఘంలోని మహిళలందరినీ లక్షాధికారులను చేయాలనేదే ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఉద్దేశమని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ తెలిపారు. ఆదివారం స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో మహారాష్ట్ర నుంచి భారత ప్రధాని మంత్రి నరేంద్ర మోది లక్ పతి దీదీ కార్యక్రమం ప్రారంభించగా కలెక్టర్, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం, పిడి డిఆర్‌డిఏ ప్రభావతి కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం మహిళలను లక్షాధికారులను చేయడమే లక్ష్యంగా లక్‌పతి దీదీ పథకాన్ని ప్రతిష్టాత్మకంగా అమలు చేయడం జరుగుతోందన్నారు. జిల్లాలోని స్వయం సహాయక సంఘంలోని మహిళలు పథకాన్ని ఉపయోగించుకుని లక్షాధికారులు కావాలని తెలిపారు. వెలుగు సంస్థ ప్రారంభమై ఇప్పటికి దాదాపు 24 సంవత్సరాలు అయిందని, ఈసంస్థ ద్వారా స్వయం సహాయక సంఘంలోని మహిళలు ఆర్థిక పరిపుష్టి సాధించడం జరిగిందని తెలిపారు. జిల్లాలోని స్వయం సహాయక సంఘాలలోని ప్రతి మహిళ లక్షాధికారి కావాలని కోరుకుంటున్నానని మహిళ సాధికారత సాధించే దిశగా... ఆర్థిక అభివృద్ధి సాధించాలని తెలిపారు. ఎమ్మెల్సీ మాట్లాడుతూ మహిళల సామర్థ్యాన్ని గుర్తించి ఆర్థికంగా భరోసా కల్పించే దశగా.. కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు చేపడుతుందని స్వయం సహాయక సంఘాల మహిళలు వాటిని సద్వినియోగం చేసుకో కలిగితే లక్షాధికారులు తప్పక అవుతారని తెలిపారు. రేషన్‌కార్డ్, ఆరోగ్యశ్రీ, ఇళ్ళపట్టాలు తదితర పథకాలను కూడా మహిళల పేరు మీదనే ఉన్నాయని తెలిపారు. మహిళలు అభివృద్ధి చెందితే రాష్ట్రం దేశం అభివృద్ధి చెందుతుందని కావున మహిళలందరూ లక్షాధికారులు కావాలని ఆశిస్తున్నానని అన్నారు. డిఆర్‌డిఏ పిడి మాట్లాడుతూ.. జిల్లాలోని స్వయం సహాయక సంఘాలలోని మహిళలు ఆదాయ వనరుల వైపు దృష్టి పెట్టాలని తెలిపారు. స్వయం సహాయక సంఘంలోనే మహిళల్లో ఎవరైతే సంవత్సరానికి లక్ష రూపాయల ఆదాయం దాటే మహిళలను గుర్తించడం జరిగిందన్నారు. ఈసంవత్సరం చివరి నాటికి జిల్లాలో నిర్దేశించిన లక్ష్యానికి అనుగుణంగా 1,01,800 మందిని లక్షాధికారులు చేయాలని కలెక్టర్ తెలిపారు. స్త్రీనిధి, ఉన్నతి, తదితర పథకాల కింద రుణాలు మహిళా సంఘాలకు మంజూరు చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమం అనంతరం సంవత్సరానికి లక్ష రూపాయల ఆదాయం దాటే మహిళా సంఘాలకు సర్టిఫికెట్స్, 7905 లక్ పతి దీదీ జీవనోపాధి కొరకు రూ. 98 కోట్ల 11 లక్షల రూపాయలు రుణాల పంపిణీ చెక్కును కలెక్టర్ చేతుల మీదుగా అందజేశారు. ఈ సమావేశంలో డిఆర్డిఏ పిడి ప్రభావతి, ఐసిడిఎస్ పిడి జయలక్ష్మి, డిఆర్డిఏ డిపి ఎం.మాధవి, స్వయం సహాయక సభ్యులు పాల్గొన్నారు.

‘న్యాయం చేయండి’

శ్రీవారి మెట్టు చిరువ్యాపారుల పిల్లల మొర

ప్రజాశక్తి- తిరుపతి టౌన్: శ్రీవారి మెట్టు చిరు వ్యాపారులకు న్యాయం చేయమని కోరుతూ వారి పిల్లలు ఆదివారం నిరసన దీక్షలో పాల్గొన్నారు. ‘టీటీడీ ఈవో అంకుల్ మాకు న్యాయం చేయండి.. మా అమ్మనాన్నలను ఆదుకోండి.. శ్రీవారి మెట్టుపై వ్యాపారాలను కొనసాగించండి, మా స్కూలు ఫీజులకు సహకరించండి...’ అంటూ టీటీడీ పరిపాలనా భవనం ఎదురుగా ఉన్న శిబిరంలో చిన్నారుల నినాదాలు చేశారు. గత ఐదు రోజులుగా శ్రీవారి మెట్టు చిరు వ్యాపారులు తమకు న్యాయం చేయాలని, శ్రీవారి మెట్టు నడకమార్గంలో చిరు వ్యాపారులకు సహకరించాలని కోరుతూ టీటీడీ పరిపాలనా భవనం ఎదుట నిరసన దీక్షను కొనసాగిస్తున్నారు. ఆదివారం ఉదయం వినూత్నంగా శ్రీవారి మెట్టు చిరు వ్యాపారుల పిల్లలతో నిరసన దీక్షను చేపట్టారు. ఈ సందర్భంగా పిల్లలు ప్లకార్డులు చేతిలో పట్టుకొని నినాదాలు చేశారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి మాట్లాడుతూ శ్రీవారి మెట్టు చిరు వ్యాపారుల సమస్య న్యాయమైనదని, పరిష్కారానికి టిటిడి యాజమాన్యం సహకరించాలని కోరారు. గతంలో తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొన్న శ్రీవారి మెట్టు వ్యాపారులు పలు దాడులకు గురయ్యారని, 20 ఏళ్లకు పైగా వ్యాపారాలు చేసుకుంటున్న వారికి అవసరమైన హాకర్ లైసెన్సులు ఇవ్వలేదని, టీటీడీ యాజమాన్యం సానుకూలంగా స్పందించి వారికి న్యాయం చేయాలని, 31 కుటుంబాలు నిరవధిక నిరసన దీక్షలో పాల్గొంటున్న నేపథ్యంలో వారికి అన్యాయం చేయవద్దని, దళారులకు అవకాశం ఇవ్వవద్దని ఆయన విజ్ఞప్తి చేశారు. సిఐటియు జిల్లా కార్యదర్శి ఎస్.జయచంద్ర, గండికోట నాగ వెంకటేష్, గంగులప్ప, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రవి, నాయకులు చిట్టిబాబు, మధు, యుగంధర్, రామ్మూర్తి, నరసింహ, చిరంజీవి, గిరి పాల్గొన్నారు.



శ్రీ చైతన్య పాఠశాలలో శ్రీ కృష్ణాష్టమి సంబరాలు

ప్రజాశక్తి- తిరుమల: టీ.ఎస్.ఎన్ పురంలో కృష్ణాష్టమి సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు కృష్ణ, రాధా, రుక్మిణి, వివిధ రకాల వేషధారణలో పాఠశాలకు విచ్చేసి పలు రకాల ప్రదర్శనలు నిర్వహించారు. కృష్ణ వేషధారణలో వచ్చిన విద్యార్థులందరి చేత ఉట్టి కొట్టించారు. యశోదమ్మ కృష్ణుని రోలుకి కట్టేసిన ఘట్టాన్ని, అలాగే గోవర్ధనగిరిని పైకెత్తి గోవులను గోపాలకులను రక్షించిన సన్నివేశాలను విద్యార్థులు తమ ప్రదర్శన ద్వారా కళ్ళకు కట్టినట్టుప్రదర్శించారు. వారి పాటలతోనూ నృత్య ప్రదర్శనలతోను అందరినీ మంత్రముగ్ధులను చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు లక్ష్మీ ప్రసన్న మాట్లాడుతూ కృష్ణ జన్మదినం గురించి వివరించారు. శ్రీమన్నారాయను ని దశావతారాలలో ఒకటైన శ్రీకృష్ణ పరమాత్మ జన్మ వృత్తాంతాన్ని విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులకు శ్రీ చైతన్య విద్యాసంస్థల ఏజీ.ం సురేష్ అభినందనలు తెలియజేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు లక్ష్మీప్రసన్న, కె.మోహన్ బాబు, జోనల్ కోఆర్డినేటర్ సుధా నాయర్, ఫెసిలిటేటర్ ప్రవీణ , డీన్ రామకృష్ణ ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.



కేంద్ర మంత్రి గడ్కరీ ఆదేశాలతో కేంద్ర కమిటీ రాక

ఆర్టీసీ అధికారులతో సమీక్ష



ప్రజాశక్తి- తిరుపతి టౌన్: తిరుపతిలో ఇంటర్ మోడల్ బస్టాండ్ నిర్మించేందుకు కార్యాచరణ వేగవంతం అయ్యింది. నిర్మాణ పనులకు టెండర్లు పిలిచి వేగవంతం చేయాలని కోరుతూ గతవారం ఢిల్లీలో కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని తిరుపతి ఎంపీ డాక్టర్ గురుమూర్తి కలిసి చర్చించిన తరువాత త్వరిత గతిన పనులు మొదలయ్యేలా చూడాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఈ నేపథ్యంలో ఆదివారం నేషనల్ హైవేస్ లాజిస్టిక్స్ మేనేజ్‌మెంట్ లిమిటెడ్ సీఈఓ ప్రకాష్ గౌర్, ప్రాజెక్ట్ డైరెక్టర్ పూజా మిశ్రా తిరుపతి విచ్చేశారు. తిరుపతి బస్టాండులో సమీక్షా సమావేశం నిర్వహించిన తరువాత బస్టాండ్ ప్రాంగణాన్ని పరిశీలించి వివరాలను తెలుసుకొన్నారు. అనంతరం తిరుపతి ఎంపీ గురుమూర్తి మాట్లాడుతూ మల్టి మోడల్ బస్టాండ్ నిర్మాణ పనులు వైఎస్. జగన్మోహన్ రెడ్డి నేతృత్వంలోని గత ప్రభుత్వ హయాంలోనే అన్ని అనుమహులు వచ్చాయని కానీ బస్టాండ్ డిజైన్స్‌లో కొన్ని మార్పులు కోరడంతో అవి సిద్ధం అయ్యేలోగా ఎన్నికల కోడ్ రావడంతో నిర్మాణ పక్రియ ఆగిందని అన్నారు. ఇంటర్ మోడల్ బస్టాండ్ నిర్మాణం భవిష్యత్ ప్రయాణికుల అవసరాలను దృష్టిలో ఉంచుకొని అధునాతనంగా నిర్మిస్తున్నారని అన్నారు. ఈ నిర్మాణాలు ఆధ్యాత్మికత ఉట్టిపడేలా ఉండనున్నాయని ప్రయాణికులకు సౌకర్యవంతంగా ఉండేలా బస్ టెర్మినల్, వాణిజ్య సముదాయాలు, ఫుట్ ఓవర్ బ్రిడ్జి, బస్టాండ్, రైల్వేస్టేషన్‌ని అనుసంధానం చేస్తూ స్కై వాక్, డార్మెటరీలు, ఎలక్ట్రిక్ బస్సులు ఛార్జింగ్ చేసేందుకు అనుకూలంగా ఛార్జింగ్ స్టేషన్ సౌకర్యాలతో రూపుదిద్దుకోనుందని ఆయన తెలియజేశారు. ఈ నిర్మాణానికి సంబంధించి ఏవైనా పరిపాలన అనుమతులు అవసరమైన పక్షంలో ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం త్వరితగతిన స్పందించినట్లయితే టెండర్లు పూర్తయి త్వరలో పనులు మొదలవుతాయని ఎంపి తెలిపారు.

మేనేజ్‌మెంట్ కోర్సులతో ఉన్నతావకాశాలు : ప్రిన్సిపల్

ప్రజాశక్తి - క్యాంపస్

ప్రస్తుత కాలంలో కామర్స్, మేనేజ్‌మెంట్, కంప్యూటర్ సైన్స్ కోర్సులు పూర్తి చేసుకున్న విద్యార్థులకు కార్పొరేట్ సంస్థల్లో ఉన్నతమైన ఉద్యోగాలకు అవకాశం వుందని మేనేజ్‌మెంట్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య పివి నరసయ్య పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన 'ప్రజాశక్తి'తో మాట్లాడుతూ శ్రీ వేంకటేశ్వర యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ కామర్స్ మేనేజ్‌మెంట్ అండ్ కంప్యూటర్ సైన్స్ కళాశాల గత రెండు దశాబ్దాల కాలంలో ఎంతో ఉన్నతంగా అభివృద్ధి చెందిందని ఈ కళాశాలలో చదువు పూర్తి చేసుకున్న విద్యార్థులు దేశంలోని ప్రముఖమైన కార్పొరేట్ సంస్థలలో, ఇతర ప్రభుత్వ సంస్థలలో ఉన్నత రంగాలలో రాణిస్తున్నారన్నారు. ప్రస్తుతం కళాశాలలో మాస్టర్ ఆఫ్ కామర్స్, మాస్టర్ ఆఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ అండ్ కంప్యూటర్ సైన్స్ కోర్సులు అందుబాటులో ఉన్నాయన్నారు. అనుభవజ్ఞులైన ప్రొఫెసర్ల బోధన, అధునాతనమైన కంప్యూటర్ ల్యాబ్స్, ట్రైనింగ్ ల్యాబ్స్, గ్రంథాలయం అందుబాటులో ఉన్నాయని తెలిపారు. విద్యార్థుల్లో సృజనాత్మకత, నైపుణ్యాల మెరుగుకు ఇంటర్ డిపార్టుమెంటల్ కాంపిటీషన్స్, వర్క్ షాప్స్, పలు సాంస్కృతిక కార్యక్రమాలు, క్రీడలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రస్తుత కళాశాలలోని మాస్టర్ ఆఫ్ కామర్స్ కోర్సు కోసం అడ్మిషన్స్ జరుగుతున్నాయని, ఎంకామ్ చేయాలనుకునే విద్యార్థులు ఎస్‌వియూ కాలేజ్ ఆఫ్ కామర్స్ మేనేజ్‌మెంటు అండ్ కంప్యూటర్ సైన్స్ అందిస్తున్న ఎం కామ్ కోర్సును ఐచ్ఛికంగా ఎంచుకోవాలని సూచించారు. కళాశాలలోని కామర్స్ డిపార్టుమెంటులో విద్యార్థులకు యుజిసి నెట్, ఎపి సెట్, జూనియర్ కాలేజీ లెక్చరర్, డిగ్రీ కళాశాల లెక్చరర్ల పరీక్షల కోసం సన్నద్ధం అయ్యేలా బోధన ఉంటుందని అన్నారు. టాలీ, షాప్ వంటి అకౌంటింగ్ సాఫ్ట్వేర్ ట్రైనింగ్, కమ్యూనికేషన్ అండ్ ఆప్టిట్యూడ్ స్కిల్స్ కొరకు ప్రత్యేకంగా శిక్షణ కార్యక్రమాలను, కోర్సులను నిర్వహిస్తున్నామన్నారు. ఎం కామ్‌లో ఎంకామ్ రెగ్యులర్, ఎం.కామ్ (అకౌంట్స్, ఫైనాన్స్), ఎంకామ్ (ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్) వంటి ప్రత్యేకమైన కోర్సులను అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. ప్రతి విద్యార్థికి కోర్సుకు అయ్యే ఖర్చు మొత్తం ప్రభుత్వం ఫీ రీయింబర్స్‌మెంట్ రూపంలో చెల్లిస్తుందని పేర్కొన్నారు. కళాశాలలో ఎంబీఏ డిపార్టుమెంటు అండ్ కంప్యూటర్ సైన్స్ డిపార్టుమెంట్ ఎంతో అధునాతనమైనవని, అనేక మంది అనుభవజ్ఞులైన ప్రొఫెసర్లచే బోధన ఉంటుందని తెలిపారు. మేనేజ్మెంట్ డిపార్ట్మెంట్ అమెరికాలోని వివిధ యూనివర్సిటీల సహకారంతో సమాచార సాంకేతిక పరికరాల వినియోగాన్ని తమ పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా పాఠ్య ప్రణాళికను, విద్యార్థుల భవిష్యత్తు కోసం అవసరమైన నైపుణ్యాలను అందించేలా రెండు సంవత్సరాల ఎంబీఏ ప్రోగ్రాంను రూపొందించినట్లు తెలిపారు. కళాశాలలోని కంప్యూటర్ సైన్స్ విభాగంలో ఎంసీఏ, మాస్టర్ ఆఫ్ కంప్యూటర్ సైన్స్ అండ్ ఎమ్మెస్ (డేటాసైన్స్) వంటి కోర్సులు అందుబాటులో ఉన్నాయన్నారు. విద్యార్థులు ఎం.కామ్ కోర్సుతో పాటు కళాశాలలో ఉన్న మాస్టర్ ఆఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్, కంప్యూటర్ సైన్స్ కోర్సులలో లేదా ఫిలాసఫీ, మాథెమాటిక్స్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, పొలిటికల్ సైన్స్, ఎకనామిక్స్ వంటి మరొక డిపార్టుమెంట్ కి సంబంధించిన ఏదైనా ఒక సబ్జెక్ట్ ఓపెన్ ఎలక్టివ్ గా ఎంచుకొని చదువుకునేందుకు అవకాశం ఉందని తెలిపారు. ఎపిఎస్సిహెచ్ఈ వాళ్లు రూపొందించిన 'ఎడెక్స్' వంటి ఆన్లైన్ కోర్సులు అందుబాటులో ఉన్నాయని, వీటి ద్వారా అదనపు అకడమిక్ క్రెడిట్స్ పొందటానికి వీలవుతుందని తద్వారా ఉద్యోగ అవకాశాలు పొందటం సులభతరం అవుతుందన్నారు. ఎపి పిజి సెట్ ద్వారా ఎస్ వి యు కామర్స్ మేనేజ్‌మెంట్ అండ్ కంప్యూటర్ సైన్స్ కళాశాలలో ఎం కామ్ కోర్సులో చేరేందుకు వెబ్ ఆప్షన్లలో పిజి 054 ఎమ్ కాం (ఆర్), పిజి 055 ఎమ్ కాం – ఎస్వియు సిఎస్ఎఫ్, పిజి 056, ఎం.కామ్ (ఎఫ్.ఎం) ఎస్వియు సిఎస్ఎఫ్ ఎంచుకోవాలని సూచించారు. డిగ్రీ పూర్తి చేసి పీజీ సెట్ కౌన్సెలింగ్ ద్వారా చేరే విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం



ప్రజాశక్తి- సత్యవేడు: మండల పరిధిలోని రాజగోపాలపురం పంచాయతీ బాల గోపాలపురంలో ఆదివారం మధ్యాహ్నం లక్ష్మమ్మకి చెందిన ఇల్లు విద్యుత్ సర్క్యూట్‌తో దగ్ధం కావడంతో ఇంటిలోని వస్తువులన్నీ కాలి బూడిదయ్యాయి. ఆదివారం సొంత పని నిమిత్తం కుటుంబ సభ్యులు పక్క వేరే గ్రామానికి వెళ్లారు.. ఆ సమయంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మంటలు వ్యాపించి ఇల్లు మొత్తం కాలిపోయింది. అగ్నిమాపకశాఖ సిబ్బందికి తెలిపేలోపే ఇంటిలోని వస్తువులన్నీ కాలి బూడిదయ్యాయి. ప్రమాదంలో కూలి నాలి చేసుకుని సంపాదించుకున్న రూ.15వేల నగదు, ఎలక్ట్రానిక్ వస్తువులు, ఇంటిలోని సామాగ్రి అంతా మంటల్లో కాలిపోవడంతో రోడ్డు మీద పడ్డారు. సుమారు లక్షకు పైగానే నష్టం వాటిల్లిందని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు. ఈవిషయాన్ని తెలుసుకున్న జనసేన పార్టీ సత్యవేడు మండల అధ్యక్షులు కూరకుల రూపేష్ వెంటనే ఘటన స్థలానికి చేరుకొని జరిగిన నష్టాన్ని పరిశీలించి బాధిత కుటుంబాన్ని పరామర్శించి ధైర్యపరిచారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధమై నష్టపోయిన లక్ష్మమ్మ కుటుంబానికి నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు.

అనారోగ్యంతో ఏనుగు మృతి

ప్రజాశక్తి- యర్రావారిపాలెం: మండలంలోని నెరబైలు గ్రామపంచాయతీ పులిబోనుపల్లి గ్రామ అటవీ సమీపంలో భారీ మదపుటేనుగు మృతి చెందింది. స్థానికులు ఆదివారం అందించిన సమాచారం మేరకు అటవీ శాఖ అధికారులు సంఘటన స్థలానికి చేరుకొని ఏనుగును పరిశీలించి అనారోగ్యంతో మృతి చెందినట్లు గుర్తించారు. డీఎఫ్ఓ సతీష్, సీసీఎఫ్ నాగేశ్వరరావు, తిరుపతి జూ పార్క్ క్యూరేటర్ సెల్వం, స్క్వాడ్ డిఎఫ్ఓ శివప్రసాద్, జూపార్క్ డాక్టర్లు ఏనుగును పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం తిరుపతికి తీసుకెళ్లినట్లు తెలిపారు. ఏనుగు మృతిచెంది రెండు రోజులు పైన కావడంతో కుళ్ళిపోవడం జరిగింది. పోస్టుమార్టం వచ్చిన అనంతరం ఏనుగు అనారోగ్యానికి, మృతికి గల కారణాలు తెలియజేస్తామని ఫారెస్ట్ అధికారులు తెలిపారు.



రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

ప్రజాశక్తి- రామచంద్రపురం (చంద్రగిరి)


పూతలపట్టు- నాయుడుపేట జాతీయ రహదారి చంద్రగిరి మండలం ఐతే పల్లి సమీపంలో ఆదివారం తెల్లవారుజామున నాలుగున్నర గంటల సమయంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి అక్కడికక్కడే దుర్మరణం చెందారు. చంద్రగిరి పోలీసులు తెలిపిన వివరాలు మేరకు అన్నుదాసు (30) సంవత్సరాలు గల వ్యక్తి ఈ నెల 22వ తేదీన శ్రీవారి దర్శనానికి వెళ్ళి తిరుమలలోని అశ్విని హాస్పిటల్‌లో వైద్యచికిత్స పొందినట్లు తెలిపారు. మృతుడు తిరుగు ప్రయాణంలో చంద్రగిరి- ఐతే పల్లి జాతీయ రహదారిలో వెళుతుండగా మారుతి వ్యాన్ ఢీకొట్టడంతో అన్నుదాసు (30) మృతి చెందినట్లుగా తెలిపారు. వాహనాన్ని ఘటనా స్థలంలో నిలిపి డ్రైవరు పరారయ్యాడు. రోడ్డుపై పడిన మృతదేహంపై నుండి ఇతర వాహనాలు వెళ్లడంతో మృతుడి ముఖం ఛిద్రమై గుర్తు గుర్తుపట్టలేని విధంగా మారింది. మృతుడు బ్లాక్ కలర్ ప్యాంటు, బ్రౌన్ రంగు గడులు ఉన్న షర్ట్ ధరించి ఉన్నారు. పోలీసులు సంఘటనా స్థలం చేరుకుని మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం తిరుపతి వైద్యకళాశాలకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడి వివరాలు తెలిసినవారు చంద్రగిరి సీఐ రామయ్య 94407 96760కు తెలియజేయాలని కోరారు.

అడవిలోకి చొరబడుతున్న 19 మంది అరెస్టు

3 కార్లు, గొడ్డళ్లు, రంపాలు స్వాధీనం

ప్రజాశక్తి- రామచంద్రాపురం (చంద్రగిరి)

తిరుపతి సమీపంలోని నాగపట్ల అటవీ ప్రాంతంలోకి చొరబడుతున్న 19మందిని టాస్క్ ఫోర్సు పోలీసులు అరెస్టు చేసి, వారి నుంచి మూడు కార్లు, 4 పిడిలేని ఇనుప గొడ్డళ్లు, ఒక ఇనుప బారీన, 4 ఇనుప రంపాలు స్వాధీనం చేసుకున్నారు. టాస్క్ ఫోర్సు ఇన్చార్జి, తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్ సుబ్బరాయుడు ఆదేశాల మేరకు, టాస్క్ ఫోర్సు ఎస్పీ కే.శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆర్ఐ సురేష్ కుమార్ రెడ్డికి చెందిన కేవెస్కే లింగాధర్ టీమ్ ఆదివారం కూంబింగ్ చేపట్టింది. ఈ బృందం భాకరాపేట చేరి, అక్కడ నుంచి శ్రీవారిమెట్టు వైపు ఎంట్రీ, ఎగ్జిట్ పాయింట్లను తనిఖీ చేసుకుంటూ వస్తుండగా చంద్రగిరి మండలం నాగపట్ల అటవీ పరిధిలోని నరసింగాపురం రైల్వే గేటు సమీపంలోని రైల్వే అండర్ బ్రిడ్జి సమీపంలోని నిషేధిత అటవీ ప్రాంతంలో మూడు వాహనాలు కనిపించాయి. వాహనాలను చుట్టుముట్టి తనిఖీ చేస్తుండగా, అందులోని వ్యక్తులు పారిపోయే ప్రయత్నం చేశారు. వారిని అడ్డుకుని అదుపులోకి తీసుకున్నారు. కారులో నాలుగు పిడిలేని గొడ్డళ్లు, ఒక ఇనుప బారిస, నాలుగు ఇనుప రంపాలు ఉన్నాయి. వారిని విచారించగా ఎర్రచందనం కోసం అడవిలోకి వెళుతున్నట్లు తెలిసింది. అరెస్టయిన వారిలో తిరుపతి సత్యనారాయణ పురంకు చెందిన ఎన్వీ శివ (45), డీ.జానకిరామ్ (36), రైల్వే కోడూరుకు చెందిన నాయని శివ (36), తోట లక్ష్మీపతి (30), కార్వేటినగరానికి చెందిన ప్రభాకర్ (45), తమిళనాడు తిరువన్నామలై జిల్లాకు చెందిన దక్షిణా మూర్తి (29), సినరాజా (49), కుమార్ చిన్నప్పయ్యన్ (35), తిరుపత్తూరు జిల్లాకు చెందిన రామలింగరాజు (54), పార్తిబన్ కుమార్ (24), స్వామినాథన్ అన్నామలై (38), వాసుమణి (23), ఆర్ రవి (40), ఏ. అన్నామలై (35), కార్తీక్ (42), సేతుమణి (26), శంకర్ (44), కుమార్ రాజా (44), కార్తీక్ (25)లు ఉన్నారు. వీరిని తిరుపతి టాస్క్ ఫోర్సు పోలీసు స్టేషన్ కు తరలించి కేసు నమోదు చేయగా, సీఐ సురేష్ కుమార్ దర్యాప్తు చేస్తున్నారు.




పారిశుధ్య పరిరక్షణ పట్టదా..?

పట్టణ ప్రజల ఇక్కట్లు


ప్రజాశక్తి - పుత్తూరు టౌన్


కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని చెబుతున్నా మున్సిపల్ అధికారులు నిర్లక్ష్యం వహిస్తోంది. దీంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. స్థానిక ప్రభుత్వ బాలికల పాఠశాల, జూనియర్ కళాశాల సమీపంలో ప్రధాన రోడ్డుపై చెత్తకుండీ నుండి కంపు కొడుతున్నాయి. వాసన భరించలేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. విద్యార్థులే కాక చుట్టుపక్కల గృహాల వారు కూడా వాసన పీల్చుకోలేక ఇబ్బందులకు గురి అవుతున్నారు. కుళ్లిన చెత్తలో దోమలు చేరి విష జ్వరాలు, డెంగీ, మలేరియా టైఫాయిడ్ వంటి విష జ్వరాలకు గురి అవుతూ ఆస్పత్రి పాలవుతున్నారు. మున్సిపల్ అధికారులు పట్టించుకోక నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత మున్సిపల్ అధికారులు స్పందించి పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని, రోడ్లపై చెత్తను లేకుండా పూర్తిగా తొలగించి ప్రజలకు ఎలాంటి సమస్యా లేకుండా చూలన్నారు. లేని పక్షంలో ప్రజలు కార్యాలయం ఎదుట ధర్నా చేస్తామని హెచ్చరించారు.













యుటిఎఫ్ స్వర్ణోత్సవ మహాసభలను జయప్రదం చేయండి



ప్రజాశక్తి- శ్రీకాళహస్తి: ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ఆవిర్భవించి 50 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ సంవత్సరం డిసెంబరు 14 నుంచి 17వ తేదీ వరకు కాకినాడలో జరుగబోవు యుటిఎఫ్ స్వర్ణోత్సవ మహాసభలను జయప్రదం చేయాలని ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎస్ఎస్ నాయుడు పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణంలోని కైకాలవారి సత్రంలో యుటిఎఫ్ జిల్లా కమిటీ సమావేశం జరిగింది. ఎస్ ఎస్ నాయుడు మాట్లాడుతూ ఎందరో నాయకుల త్యాగాల ఫలితంగా ఈరోజు ఉపాధ్యాయులు ఉన్నతమైన స్థానంలో ఉన్నారనీ, వృత్తిపరంగా, సర్వీస్ పరంగా అనేక సౌకర్యాలు పొందగలుగుతున్నారని అన్నారు. గత కాలపు నాయకుల కృషి, త్యాగాలను గుర్తు చేసుకుంటూ భవిష్యత్ కార్యక్రమాలను రూపొందించుకోవడానికి ప్రతి కార్యకర్త స్వర్ణోత్సవ మహాసభల్లో పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు. అలాగే కేంద్ర ప్రభుత్వం నిన్న ఆమోదించిన యూనిఫైడ్ పెన్షన్ స్కీం ఉద్యోగ, ఉపాధ్యాయులకు అంత ఉపయోగకరమైనది కాదనీ, ఉద్యోగుల కాంట్రిబ్యూషన్‌తో పెన్షన్ ఇవ్వడాన్ని తాము కోరుకోవడం లేదని తెలిపారు. సంవత్సరాల తరబడి సేవ చేసిన ఉద్యోగులకు ప్రభుత్వం ఇచ్చే గౌరవంగా పెన్షన్ ఉండాలని తాము కోరుకుంటున్నామని వివరించారు.

కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన యూనిఫైడ్ పెన్షన్ స్కీమును మరింత లోతుగా అధ్యయనం చేసిన తర్వాత సంఘపరంగా స్పందిస్తామని తెలిపారు. జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జీ జే రాజశేఖర్, ముత్యాలరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొని జరుపుతున్న పని సర్దుబాటు ప్రక్రియ అసంబద్ధంగా ఉందనీ, ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వులకు, మండలస్థాయిలో జరిగినటువంటి పని సర్దుబాటుకు పొంతనలేదని విమర్శించారు. ఈ విషయమై ఇప్పటికే జిల్లాస్థాయి అధికారులకు, రాష్ట్ర స్థాయి అధికారులకు ఫిర్యాదు చేయడం జరిగిందనీ, దీనిని సవరించి స్పష్టమైనటువంటి ఉత్తర్వులతో ఎలాంటి అవకతవకలకు తావు లేకుండా పని సర్దుబాటు చేయాలని కోరారు. జిల్లా సహాధ్యక్షులు కెఎస్‌బి సూర్యప్రకాష్, శేఖర్, నిర్మల, రాజేష్ బాబు, మోహన్ బాబు తదితరులు పాల్గొన్నారు.

'చంద్రగిరి పోలీసులపై చర్యలు తీసుకోవాలి'

ప్రజాశక్తి- తిరుపతి టౌన్: సీఐ సమక్షంలోనే చంద్రగిరి పోలీస్ స్టేషన్లో అధికార పార్టీ నాయకుడు రజక మహిళపై చెప్పుతో దాడి చేయడాన్ని సిపిఎం తీవ్రంగా ఖండిస్తోందని, దోషుల పట్ల, వ్యతిరేకించాల్సిన పోలీసుల పట్ల కఠినంగా వ్యవహరించాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కందారపు మురళి ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు వరదయ్యపాలెం ఏఎస్ఐ షణ్ముగంను సస్పెండ్ చేసి 24 గంటలైనా ముగియకముందే చంద్రగిరి పోలీసుల తీరు ఆక్షేపణీయంగా ఉందని విమర్శించారు. చంద్రగిరి సిఐ సమక్షంలోనే అధికార పార్టీ నాయకుడు ఇంతలా చెలరేగి పోతే... పోలీసులు నిమ్మకు నీరెత్తినట్లు ప్రవర్తించడం దారుణమని అన్నారు. తిరిగి జిల్లా ఎస్పీ జోక్యం చేసుకొని సమస్యను పట్టించుకోవాలని కోరటం పోలీసు వ్యవస్థలో కొనసాగుతున్న తీవ్రమైన నిర్లక్ష్యానికి మరో ఉదాహరణగా పేర్కొన్నారు. జిల్లా ఎస్పీ స్పందించి చంద్రగిరి పోలీసుల పట్ల కఠినంగా వ్యవహరించాలని, బాధితులకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయంలో

ఆక్టోపస్ దళం మాక్ డ్రిల్



ప్రజాశక్తి- తిరుపతి సిటీ

తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయంలో ఆదివారం తెల్లవారు జామున టిటిడి విజిలెన్స్ సిబ్బంది, ఆక్టోపస్ దళం మాక్ డ్రిల్ నిర్వహించారు. ఉగ్రవాదులు చొరబడినప్పుడు, ఏదేని అత్యవసర పరిస్థితులు వాటిల్లినప్పుడు ఎలా ఎదుర్కోవాలి, భక్తులను ఎలా రక్షించాలి అనే విషయాలను మాక్ డ్రిల్ ద్వారా చేసి చూపారు. ఆక్టోపస్ దళాలు రాష్ట్రంలోని వివిధ ప్రముఖ స్థలాలు, ఆలయాలు, ప్రభుత్వరంగ సంస్థల్లో ఏటా మాక్ డ్రిల్స్ నిర్వహించడం జరుగుతుంది. ఈ కార్యక్రమంలో విజివో నందకిషోర్, ఏవీఎస్వో సతీష్ తదితరులు పాల్గొన్నారు.

గిడుగు జయంతి సందర్భంగా

వ్యాస రచన పోటీలు



ప్రజాశక్తి- తిరుపతి టౌన్: గిడుగు రామమూర్తి జయంతిని పురస్కరించుకొని ఆదివారం వేమన విజ్ఞాన కేంద్రంలో పాఠశాల విద్యార్థులకు కథలపోటీలు, ఉపన్యాస పోటీలు ఘనంగా నిర్వహించారు. ఈ పోటీల్లో ప్రభుత్వ, ప్రైవేట్ స్కూళ్ల పిల్లలు పెద్దఎత్తున హాజరయ్యారు. ఉపన్యాస విజేతలుగా జూనియర్స్ విభాగంలో మొదటి బహుమతి ఎస్‌జిఎస్ హైస్కూల్లో 6వ తరగతి చదువుతున్న అభిషేక్ రెడ్డి, రెండవ బహుమతి ఎస్‌కెఆర్ఎస్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్లో 6వ తరగతి చదువుతున్న లాస్య, తృతీయ బహుమతి లక్ష్మీప్రసన్న హైస్కూల్లో 7వ తరగతి చదువుతున్న రెడ్డి బెష్వంత్, కన్సొలేషన్ బహుమతిని గౌతం ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో 5వ తరగతి చదువుతున్న కనిష్కలు గెలుపొందారు. సీనియర్స్ విభాగంలో మొదటి బహుమతి ప్రశాంత్ ఇంగ్లీష్ మీడియం స్కూల్లో 9వ తరగతి చదువుతున్న పూజిత, రెండవ బాహుమతి రెయింబో ఇంగ్లీష్ మీడియం స్కూల్లో 9వ తరగతి చదువుతున్న పిక, మూడవ బహుమతి ఎస్‌జిఎస్ హైస్కూల్లో 10వ తరగతి చదువుతున్న నిశాంత్ చక్రవర్తి, కన్సొలేషన్ ఎస్‌వి హైస్కూల్లో 8 తరగతి చదువుతున్న జయశ్రీలు గెలుపొందారు. ఈ కార్యక్రమానికి న్యాయనిర్ణేతలుగా విశ్రాంత తెలుగు పండితులు శేషుకుమార్, మునిరెడ్డి వ్యవహరించారు. ఇందులో వేమన విజ్ఞాన కేంద్రం ప్రధాన కార్యదర్శి మల్లారపు నాగార్జున, బాలోత్సవం గౌరవ అధ్యక్షులు టెంకాయల దామోదరం, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నడ్డినారాయణ, గురునాథం, ప్రముఖ కథా రచయిత కృష్ణస్వామి రాజు, రెడ్డెప్ప,మునిలక్ష్మి, తహసున్నిసా, ముఖేష్, రెడ్డెప్ప, ఓ.వెంకట్రమణ, రఫీ, కుప్పస్వామి పాల్గొన్నారు.

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక రద్దు


ప్రజాశక్తి- తిరుపతి టౌన్: తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించనున్న ప్రజాసమస్యల పరిష్కారవేదిక కార్యక్రమం రద్దు చేసినట్లు కమిషనర్ ఎన్.మౌర్య తెలిపారు. 26వ తేదీ సోమవారం శ్రీకృష్ణాష్టమి పర్వదినం సందర్భంగా ప్రభుత్వ సెలవు దినం కావడం వలన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం రద్దు చేసామని, ఈ విషయాన్ని నగర ప్రజలకు తెలియజేస్తున్నామని కమిషనర్ ఎన్.మౌర్య తెలిపారు.







ఆస్టర్ నారాయణద్రిలో రోబోటిక్ అండ్ రివిజన్ టికేఆర్ సేవలు



ప్రజాశక్తి- తిరుపతి సిటీ: తిరుపతిలో మొట్టమొదటిసారిగా ఆదివారం ఆస్టర్ నారాయణద్రి హాస్పిటల్‌లో రోబోటిక్‌నీ రీప్లేస్మెంట్ ఆపరేషన్లు నిర్వహించామని ఆ ఆసుపత్రి ఎండి డాక్టర్ సునంద కుమార్‌రెడ్డి తెలిపారు. స్థానిక రేణిగుంట రోడ్డులోని హాస్టల్ నారాయణాద్రి ఆసుపత్రులు ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆస్టర్ బెంగళూరు వారి సౌజన్యంతో పేషెంట్లను పూల్ ఆప్ చేసి ఆదివారం రోబో సహాయంతో ముగ్గురికి కీళ్ల మార్పిడి ఆపరేషన్లు చేశామని చెప్పారు. ఇదే కాకుండా ఎవరికైనా ఇంతకు ముందు టి.కే.ఆర్ ఆపరేషన్ జరిగి చీము పట్టి కానీ, పరికరాలు వదులు అయ్యి కానీ, ఆపరేషన్ విఫలం అయిన వాళ్లకు కూడా రివిజన్ టి.కే.ఆర్ ఆపరేషన్లు తిరుపతి ఆస్టర్ నారాయణద్రి హాస్పిటల్‌లో చేస్తున్నామని, ఇటువంటి సమస్యలతో బాధపడే వారు ఆస్టర్ నారాయణద్రి హాస్పిటల్ సేవలు ఉపయోగించుకోవచ్చని తెలిపారు. రాయలసీమ ప్రజలకు వివరించారు. మీకు మెరుగైన నడకను అందించేందుకు తాము అన్ని విధాలుగా కృషి చేస్తామని డాక్టర్ సునంద కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ డాక్టర్ శ్రీధర్‌ముని మాట్లాడుతూ, మా డాక్టర్లు అన్ని సంక్లిష్టమైన, అరుదైన సర్జరీలను నిర్వహించటంలో నైపుణ్యం కలిగి ఉన్నారని తెలిపారు. ఆస్టర్ నారాయణద్రి హాస్పిటల్‌లో మరెన్నో అడ్వాన్స్ టెక్నాలజీస్ ను తీసుకొచ్చేదుంకు మేనేజ్మెంట్ ఎప్పుడు ముందుంటుంది అని తెలిపారు. మంచి ఫలితాల కోసం రోబోటిక్ కీళ్ల మార్పిడి, రివిజన్ టి.కే.ఆర్ సర్జరీలను వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటిగ్రేటెడ్ బస్సు టెర్మినల్‌కు

త్వరలో శంఖుస్థాపన

ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు



ప్రజాశక్తి- తిరుపతి సిటీ: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆలోచన మేరకు ఇంటిగ్రేటెడ్ బస్సు టెర్మినల్‌కు త్వరలో శంఖుస్థాపన చేస్తామని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు చెప్పారు. 2014-19 చంద్రబాబు నాయుడు పాలనలో పురాతనమైన సెంట్రల్ బస్టాండ్ స్థానంలో ఇంటిగ్రేటెడ్ బస్సు టెర్మినల్ నిర్మించాలని నిర్ణయించారని ఆయన తెలపారు. కానీ మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి బస్టాండ్ నిర్మాణాన్ని పట్టించుకోకపోవడంతో బస్టాండ్ నిర్మాణం జాప్యమైందని ఆయన చెప్పారు. ఎన్‌హెచ్ ఎల్‌ఎంఎల్ సిఈఓ ప్రకాష్ గౌర్, ప్రాజెక్ట్ డైరక్టర్ పూజా మిశ్రాలను ఆదివారం సాయంత్రం ఆర్టీసి గెస్ట్ హౌస్‌లో ఎమ్మెల్యే ప్రత్యేకంగా భేటి అయ్యారు. ఇంటిగ్రేటెడ్ బస్సు టెర్మినల్ డిజనైన్‌పై త్వరలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇవ్వనున్నట్లు సిఈఓ ప్రకాష్ గౌర్ ఎమ్మెల్యేకు వివరించారు. డిజైన్స్ ఆమోదించిన వెంటనే టెండర్ల ప్రక్రియ ప్రారంభిస్తామని సిఈఓ తెలిపారు. నవంబర్ లోపు టెండర్ల ప్రక్రియ పూర్తి చేసి మార్చిలో నూతన బస్టాండ్ పనులకు శ్రీకారం చుట్టుతామని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తెలిపారు. తిరుపతివాసుల చిరకాల వాంఛ నెరవెరనుందని ఆయన చెప్పారు. ప్రయాణికులు, భక్తులకు ఆధునాతన సౌకర్యాలతో నూతన బస్టాండ్ రూపుదిద్దుకుంటుందని ఆయన తెలిపారు. ఈ భేటిలో జిల్లా ప్రజా రవాణా అధికారి చెంగల్ రెడ్డి పాల్గొన్నారు.

యుపిఎస్ కాదు ఓపిఎస్ కావాలి

యుటిఎఫ్ నేతల డిమాండ్

ప్రజాశక్తి చిత్తూరు అర్బన్: కొత్త పెన్షన్ స్కీం విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్‌కి విధానాన్ని అమలు చేయాలని యుటిఎఫ్ నేతలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యుటిఎఫ్)చిత్తూరు జిల్లా ఆఫీస్ల సమావేశం ఆదివారం యుటిఎఫ్ టీచర్స్ హోంలో జిల్లా అధ్యక్షులు ఎం.సోమశేఖర నాయుడు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో నాయకులు మాట్లాడుతూ శనివారం కేంద్ర ప్రభుత్వం ఉద్యోగులకు యుపిఎస్ విధానాన్ని అమలు చేయాలని నిర్ణయం తీసుకోవడంతో ఇది కూడా గత రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించిన జిపిఎస్‌కు మరో రూపం అంతే అన్నారు. ఎప్పుడు కూడా ఉద్యోగి కాంట్రిబ్యూషన్ లేకుండా ఇచ్చే దానినే పింఛన్ అంటారు అంతే తప్ప ఉద్యోగి నుంచి చందా వసూలు చేసి అతను రిటైర్ అయిన తర్వాత ఇచ్చేదాన్ని పెన్షన్ అనిపించుకోదని అన్నారు. ఇలా ఉద్యోగి రిటైర్ అయిన తర్వాత ఇచ్చే పింఛను ఏ ప్రైవేట్ ఇన్సూరెన్స్ కంపెనీలో నెలనెల చందా కడితే పింఛన్ ఇస్తుందని, పింఛన్ అనేది ఉద్యోగి 30,35 సంవత్సరాలు సర్వీస్ చేసిన తర్వాత అతనికి గౌరవంగా, అతని ఆత్మాభిమానాన్ని పెంచే ఒక విధంగా ఉంటుందన్నారు. సమావేశంలో యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జివి.రమణ, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎం.సోమశేఖర్ నాయుడు, ఎన్.మణి గండన్, నాయకులు పి.సుధాకర్ రెడ్డి, పిఆర్.మునిరత్నం, ఎస్.రహనబేగం, కె.ప్రసన్న కుమార్, టి.రఘుపతి రెడ్డి, కె.దీనావతి, సిపి ప్రకాష్, ఎస్‌పి బాషా, జగన్ మోహన్ రెడ్డి, ఏ. కృష్ణ మూర్తి పాల్గొన్నారు.



వైద్యుల వినూత్న నిరసన



ప్రజాశక్తి తిరుపతి సిటీ : విధులు నిర్వహించే చోట మహిళా వైద్యులకు రక్షణ కల్పించాలను కోరుతూ స్విమ్స్ వైద్యులు ఆస్పత్రి ప్రాంగణంలో చెత్త ఊడుస్తూ వినూత్న రీతిలో నిరసన వ్యక్తం చేశారు. స్విమ్స్ అత్యవసర విభాగంలో విధులు నిర్వహిస్తున్న ఓ మహిళా డాక్టర్ పై చికిత్స పొందుతున్న రోగి శనివారం దాడి చేసిన విషయం విధితమే. అందుకు నిరసనగా వైద్యులు విధులు బహిష్కరించి శనివారం రాత్రి అంతా నిరసన వ్యక్తం చేశారు. టీటీడీ జేఈవో గౌతమి, జిల్లా ఎస్పీ సుబ్బారాయుడు, స్విమ్స్ డైరెక్టర్ డాక్టర్ ఆర్ వి కుమార్ శనివారం రాత్రి అనేక సార్లు వైద్యులతో చర్చించారు. 7 వరకు తమకు ఈవో చేత రాతపుర్వకంగా హామీ ఇచ్చేంత వరకు నిరసన విరమంప చేయమని వైద్యుల ఖరాఖండగా చెప్పారు. ఆదివారం వేకువ జామున 5 గంటల ప్రాంతంలో టీటీడీ ఈవో హామీ మేరకు ఆదివారం 11 గంటలకు వైద్యులతో చర్చించి కమిటీ ఏర్పాటుకు నిర్ణయం తీసుకుంటామని గట్టిగా హామీ ఇవ్వడంతో వైద్యులు నిరసన విరమించారు. కానీ ఈవో తో చర్చలు సందర్భంగా వచ్చే హామీ మేరకు తదుపరి నిర్ణయం ప్రకటిస్తామని వైద్యులు వెల్లడించారు. అప్పటివరకు విధులకు హాజరుకామని ప్రకటించారు. విధులు నిర్వహించే చోట మహిళా వైద్యులకు కనీస సౌకర్యాలు కల్పించేంతవరకు విధులకు హాజరై ప్రసక్తే లేదన్నారు. అప్పటివరకు నిరసనలు తెలియజేస్తూనే ఉంటామన్నారు. అందులో భాగంగా ఆదివారం రాత్రి, వైద్యులు విధులు బహిష్కరించి స్విమ్స్ ప్రాంగణంలో చెత్త ఊడుస్తూ వినూత రీతులు నిరసన వ్యక్తం చేశారు.

చిత్రలేఖనంలో ప్రభంజనాన్ని సృష్టించిన పీఈఎస్ విద్యార్థులు

ప్రజాశక్తి చిత్తూరు అర్బన్

యాదమరి మండల పరిధిలోని పీఈఎస్ పబ్లిక్ పాఠశాలకు చెందిన విద్యార్థులు ఆదివారం చిత్తూరు పివికేఎన్ ప్రభుత్వ కళాశాలలో జరిగిన ఆస్ట్రో ఆర్ట్ 2024 కాంపిటీషన్లో మరోసారి వారి అమోఘమైన ప్రతిభను కనపరిచారు. ఈ కాంపిటీషన్లో పలు పాఠశాలలకు చెందిన విద్యార్థులు దాదాపు 800 మందికి పైగా పాల్గొనగా అందులో పీఈఎస్ పబ్లిక్ పాఠశాల విద్యార్థులు అన్ని కేటగిరీలలోనూ మొదటి, రెండవ, మూడవ స్థానాలలో 20మంది విద్యార్థులు తమ ప్రతిభను చాటుకున్నారు. ఆర్ట్ మాస్టరు దినేష్‌కి ఐరన్ పిల్లర్ అవార్డును బహుకరించారు. ఈ సందర్భంగా పిఈఎస్ పబ్లిక్ పాఠశాల ప్రిన్సిపాల్ వైవి.కృష్ణ బాబు మాట్లాడుతూ సృజనాత్మకతతో వ్యవహరిస్తే గొప్ప విజయాలు మన సొంతమవుతాయని తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షిస్తూ, విద్యార్థులకు, ఆర్ట్ మాస్టర్ దినేష్‌కు అభినందనలు తెలిపారు.

ప్రభుత్వ ఉద్యోగులకు ఆర్థిక భద్రత దిశగా ఏకీకృత పెన్షన్ పథకం

ప్రజాశక్తి - క్యాంపస్: ప్రభుత్వ ఉద్యోగుల ఏకీకృత పెన్షన్ పథకానికి కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలపడం పట్ల ఏబిఆర్‌ఎస్‌ఎం హర్షం వ్యక్తం చేస్తున్నదని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ప్రొఫెసర్ వైవి.రామిరెడ్డి చెప్పారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకొన్న ఈనిర్ణయం లక్షలాది మంది ప్రభుత్వ ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు వారి అంకితమైన సేవ తర్వాత గౌరవప్రదమైన, సురక్షితమైన భవిష్యత్తును నిర్ధారిస్తుందని అన్నారు. జాతీయ పెన్షన్ పథకం కింద ఉపాధ్యాయులు, ఇతర ఉద్యోగులు ఎదుర్కొంటున్న అనేక సమస్యలకు ఈ ఏకీకృత పెన్షన్స్ పథకం పరిష్కారం చూపిస్తున్నదని తెలిపారు. ఈ పథకం కనీసం 25 సంవత్సరాల సేవను పూర్తి చేసిన ఉద్యోగులకు పూర్తి పెన్షన్ కు హామీ ఇస్తుంది, పదవీ విరమణకు ముందు గత 12 నెలల నుండి వారి సగటు ప్రాథమిక జీతంలో 50 శాతం పెన్షన్‌గా అందుతుందన్నారు. 10, 25 సంవత్సరాల మధ్య సర్వీస్ పదవీకాలం ఉన్న వారికి, దామాషా ప్రకారం పెన్షన్ అందించబడుతుందని అన్నారు. దీనితో పాటు, ఈ పథకం కుటుంబాలకు ఆర్థిక భద్రతను నిర్ధారిస్తుందని, ఒక ఉద్యోగి సర్వీసు సమయంలో మరణిస్తే, వారి కుటుంబానికి పెన్షన్‌లో 60 శాతం కుటుంబ పెన్షన్‌గా అందుతుందని వెల్లడించారు. ఉద్యోగుల ప్రాథమిక వేతనంలో 18.5 శాతం ప్రభుత్వం వారి పెన్షన్‌కు జమ చేస్తుంది. ఈ పథకం కనీసం 10 సంవత్సరాల సేవతో పదవీ విరమణ పొందిన వారికి నెలకు రూ.10,000 హామీ ఇవ్వబడిన కనీస పెన్షన్‌ను అందిస్తుంది. ఇంకా, హామీ ఇవ్వబడిన పెన్షన్, కుటుంబ పెన్షన్, కనీస పెన్షన్ ద్రవ్యోల్బణం ప్రకారం సర్దుబాటు చేయబడతాయని, పెరుగుతున్న జీవన వ్యయం నుండి పెన్షనర్లకు రక్షణ కల్పిస్తాయని అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఆమోదించి ప్రవేశపెట్టిన ఈ ఏకీకృత పెన్షన్ పథకాన్ని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం కూడా రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు వెంటనే అమలు చేయాలని, రాష్ట్ర ప్రభుత్వ పెన్షన్ వాటాను 10 నుంచి 18.5 శాతానికి పెంచే విధంగా చర్యలు తీసుకోవాలని ఏబీఆర్‌ఎస్ ఎమ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

శ్రీకృష్ణ జన్మాష్టమికి

నగరంలో ట్రాఫిక్ మళ్లింపు

ప్రజాశక్తి- తిరుపతి సిటీ

శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా నగరంలోని పలుమార్గాలు ట్రాఫిక్ మళ్లించినట్లు జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు తెలిపారు. ఆదివారం అయన విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల 25 నుండి 27వ తేదీ వరకు తిరుపతిలోని హరే రామ హరే కృష్ణ రోడ్‌లోని ఇస్కాన్‌లో శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా ఉత్సవాలు నిర్వహించేందుకు సంబంధిత ఆలయ కమిటీ నిర్ణయించింది. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొనే అవకాశం ఉన్నందున స్థానిక భక్తులు, పలువురు ముఖ్యులు కాకుండా వివిధ రాష్ట్రాలు, విదేశీ యాత్రికులు పెద్దసంఖ్యలో ఈ కార్యక్రమానికి హాజరయ్యే అవకాశం ఉందన్నారు. ఉత్సవాల్లో సాంస్కృతిక కార్యక్రమాలు, ఉట్లోత్సవం ఆలయం ముందున్న బహిరంగ మైదానంలో జరుపుకుంటారు, ఈ సాంస్కృతిక కార్యక్రమాల వీక్షించుటకు స్థానికులు, బయట ప్రాంతాలనుండి భారీగా భక్తులు తరలివస్తారని తెలిపారు. దింతో ఆలయానికి వెళ్లే ముఖ్యమైన జంక్షన్‌ల వద్ద ట్రాఫిక్ క్రమబద్ధీకరణ కోసం కొన్ని సూచనలు చేయడం జరిగింధి, ప్రజలు సహకరించాలని కోరారు. ట్రాఫిక్ మళ్లించిన మార్గాలు,పార్కింగ్ ఏర్పాట్లు చేశారు. ఇస్కాన్ ఆలయం ముందు భాగమున గల రోడ్డును రుయా ఆసుపత్రి జంక్షన్ నుండి వచ్చు ద్విచక్ర వాహనాలు, నాలుగు చక్రాల వాహనాలను నియత్రించేందుకు బారికేడింగ్ ఏర్పాటు చేయడమైనది. ఉత్సవాలకు వచ్చు భక్తుల వాహనాలు అలిపిరి లింక్ బస్టాండ్ పార్కింగ్ స్థలములో ఉంచి కాలినడకన గుడికి వెళ్లొచ్చు. గుడికి కుడి వైపుగా వున్న అన్నారావు సర్కిల్ రోడ్డులో వచ్చు వాహనములు బారికేడింగ్ ద్వారా నియత్రించడం జరుగుతుంది. అన్నారావు సర్కిల్ నుంచి వచ్చే ద్విచక్ర వాహనాలు, నాలుగు చక్రాల వాహనాలకు, అక్కడ పార్కింగ్ సదుపాయం లేనందున, వారు బాలాజీ లింక్ బస్టాండ్ దగ్గర ఉన్న ద్విచక్ర వాహనాల పార్కింగ్ స్థలం వాహనాలు పార్కింగ్ చేసి, అక్కడ నుండి కాలినడకన గుడికి వచ్చులాగా ఏర్పాటు చేయడమైంది. లింక్ బుస్టాండ్ నుంచి అన్నారావు కూడలి వరకు మద్యనున్న అన్నీ సందులను బారికేడ్స్ ద్వారా వాహన రాక పోకలను నియంత్రిచడమైనది. కావున పై కనబరిచిన ట్రాఫిక్ సూచనలను పాటించి, భక్తులు, తిరుపతి పట్టణ ప్రజలు ట్రాఫిక్ అంతరాయం కలగకుండా సహకరించాలని ట్రాఫిక్ పోలీసులు కోరారు.

నేడు శ్రీలంక రైతుల

ప్రకృతి వ్యవసాయ క్షేత్ర సందర్శన

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్

జిల్లాలోని కుప్పం నియోజక వర్గంలో ఈనెల 26,27వ తేదీలలో శ్రీలంక అమృత భూమి ప్రాజెక్టు నుండి 20మంది రైతులు ప్రకృతి వ్యవసాయ సాగు పరిశీలనకు రానున్నారని, రైతు సాధికార సంస్థ ఆధ్వర్యంలో విస్తృతంగా సమర్థవంతంగా ప్రకృతి వ్యవసాయ సార్వత్రిక సూత్రాలకు అనుగుణంగా అమలు అవుతున్న ప్రకృతి వ్యవసాయ కార్యక్రమాలను పరిశీలిస్తారని జిల్లా ప్రాజెక్టు మేనేజర్ వాసు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఖాళీ స్థలాలు.. రోగాలకు ఆవాసాలు

స్థలాలు కొని వదిలేశారు.. పారిశుద్ధ్య లోపం..రోగాల విజృంభణ పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి-బుచ్చినాయుడు కండ్రిగ: మండలంలోని మండల అభివృద్ధి కార్యాలయానికి పక్కనే ఉన్న ఈ బీసీ కాలనీలో తక్కువ ధరకు స్థలాలు కొని ఎక్కువ ధర కోసం స్థల కొనుగోలుదారులు మండలంలో పలు చోట్ల స్థలాలు కొని వాటి ధరల పెంపునకు ఎదురు చూడడం సహజమే..కానీ ప్రజల అనారోగ్యం గురించి ఆలోచించకుండా స్థలాలు ఎక్కువ రోడ్డు పక్కనే వున్నాయని దృష్టిలో ఉంచుకొని స్థలాలను కొనుగోలు చేశారు. కనీసం ఏడాదికి ఒకసారి కూడా వచ్చి చూసిన పరిస్థితి లేదు. ఈ నేపథ్యంలో ఆయా ఖాళీ స్థలాల్లో చెట్లు, పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగి చుట్టుపక్కల వారికి తీవ్ర అసౌకర్యం కలిగిస్తోంది. చెత్త కూడా అదే ప్రాంతంలో వేయడంతో దుర్వాసనతో మురికి నీరు కూడా ఆ స్థలాల్లో పోయడంతో పక్కనే నివసిస్తున్నవారు వ్యాధుల బారిన పడుతున్నారు. చెట్లు, గుబురుగా పెరగడంతో విష పురుగులు, సర్పాలు సంచరిస్తున్నాయి. వర్షాకాలం కావడంతో ఖాళీ స్థలాల్లో నీరు నిలిచి దోమలు అధికమై కంటి మీద కునుక లేకుండా చేస్తున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విచిత్రం ఏంటంటే ఈ బీసీ కాలనీ సర్పంచ్ సైతం ఈ కాలనీకి చెందిన చెందిన వారే కావడం గమనార్హం. గిరిజన సామాజిక వర్గానికి చెందిన సర్పంచ్ కావడంతో అవగాహన లేక సమస్యలపై పట్టించుకోవడం లేదని స్థానికులు పేర్కొంటున్నారు. సర్పంచ్ ప్రశ్నించక పోవడంతో స్థల యజమానులు సమస్యపై స్పందించడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పారిశుధ్య లోపం..రోగాల విజృంభణ

పరిసరాలు పరిశుభ్రత లోపించడంతో స్థానికులు విష జ్వరాల బారిన పడుతున్నారు. తాము కొన్న స్థలాలకు భారీ ఆదాయం వస్తుందని యజమానులు ఆనందంతో ఎదురు


ఖాళీ స్థలాల్లో పేరుకుపోతున్న చెత్తకుప్పలు

చూస్తుంటే వ్యాధులు బారిన పడి వైద్య ఖర్చులకే ఆదాయం అంతా వెచ్చించాల్సి వస్తోందని స్థానికులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇళ్ల మధ్యలో, ముళ్ల చెట్లు పెరిగి ఉన్నప్పటికీ పారిశుధ్య విభాగం అధికారులు పట్టించుకోకపోవడంతో ఖాళీ స్థల యజమానులు సైతం పట్టించుకోవడం లేదని వాపోతు న్నారు. పంచాయతీ అధికారులు ప్రజారోగ్య పరిరక్షణకు చర్యలు తీసుకోవడం లేదు. కనీసం ఖాళీ స్థలాలకు పన్నులు కూడా చెల్లించని దుస్థితి ఏర్పడింది. అధికారులు నిత్యం ఆయా ప్రదేశాల్లో తిరుగుతున్నా కనీసం పట్టించుకోకపోవడం బాధాకరమని నివాసితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పారిశుధ్య విభాగం అధికారులు ఖాళీ స్థల యజమానుల చిరునామాలు తెలుసుకొని వారికి నోటీసులు ఇవ్వాల్సి ఉండగా వారు నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నారు. ఈ ప్రాంతంపై దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు నిలయం

ఈ ప్రాంతాలలో ఖాళీ స్థలాల్లో గుబురుగా చెట్లు పెరగడం వల్ల చుట్టుపక్కల నివాసితులకు అసౌకర్యంగా ఉంటోంది. ఈ కాలనీకి పక్కనే ఉన్న ప్రభుత్వ కార్యాలయాల్లో రాత్రి సమయంలో విద్యుత్ సౌకర్యం లేక పోవడంతో కార్యాలయాల ముందే మందు బాబులు కొన్నిచోట్ల ఖాళీ స్థలాల్లో మద్యం తాగి బాటిళ్లను సైతం పడవేస్తున్నారు. రాత్రి వేళల్లో ఈ ప్రభుత్వ కార్యాలయాల పరిసరాలే అసాంఘిక కార్యకలాపాలు నిలయాలుగా మారుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. పంచాయతీ విభాగం అధికారులు ఖాళీ స్థలాల యజమానులను గుర్తించి ఆయా స్థలాలను శుభ్రం చేయించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాల్సిన అవసరం వుంది.

విష పురుగులతో బెడద

బీసీ కాలనీ, వెంకటేశ్వర కాలనీ, బీసీ కాలనీ, లక్ష్మీపురి కాలనీలలో ఖాళీ స్థలాలు ఉండడంతో విపరీతంగా చెట్లు పెరిగిపోయి పాములు యథేచ్ఛగా సంచరిస్తున్నాయి. అధికారులు ప్రత్యేక దృష్టి సారించాల్సి వుంది. ఖాళీ స్థలాల్లో గుబురుగా పిచ్చి మొక్కలు పెరగడం వల్ల రాత్రి సమయంలో తేళ్ళు, పాములు వంటి విషపురుగులు రోడ్డు మీదకు వస్తున్నాయి. పిల్లలు పాఠశాలలు, ట్యూషన్ల నుంచి వచ్చేసమయంలో భయాందోళనకు గురవుతున్నారు. ఈ కాలనీల నుండి వందల సంఖ్యలో శ్రీ సిటీ అపాచీ వంటి వివిధ పరిశ్రమలకు రాత్రి సమయంలో, తెల్లవారు జామున సమయంలో కార్మికులు వెళ్లి వస్తుంటారు. అలాంటి వారు ఎలాంటి ప్రమాదాలు పొంచి ఉంతో అని ఆందోళన చెందు తున్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూడాల్సిన అవసరం వుంది. పంచాయతీ సర్పంచులు, అధికారులు, ఉన్నత స్థాయి అధికారులు ఖాళీ స్థలాల్లో శుభ్రం చేయించి పారిశుధ్యం మెరుగు పరచాలని , లేదంటే ఆ స్థలాలను రద్దుచేసి నిరుపేదలకు కేటాయిస్తే వారు ఆ స్థలాన్ని సద్వినియోగం చేసుకునే అవకాశం వుంది. తమకు ఇబ్బందులు లేకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రైవేట్ స్కూల్స్ సంఘం గౌరవ అధ్యక్షుడుగా భాస్కర్ రెడ్డి



ప్రజాశక్తి -పుంగనూరు: పుంగనూ రు నియోజక వర్గ ప్రైవేట్ స్కూల్స్ సంఘ గౌరవ అధ్యక్షునిగా కృష్ణారెడ్డి చైతన్య స్కూల్ ప్రిన్సిపల్ ను ఎన్నుకు న్నారు.పుంగనూరు నియో జకవర్గం ప్రైవేటు స్కూల్స్ అసోసియేషన్ కార్యవర్గ సంఘ సమావేశం పుంగనూరు పట్టణంలోని శారదా పాఠశాల ఆవరణలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్ను కున్నారు. ఏపీపీయూఎస్ యంఏ (ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ అన్ ఎయిడెడ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్) సమావేశం పుంగనూరులో నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని పుంగనూరు నియోజ కవర్గ ప్రైవేటు పాఠశాలల కరస్పాండెంట్ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా రాజమోహన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా మహిపాల్ రెడ్డి, ఉప అధ్య క్షులుగా షాకీరుల్లా, కోశాధికారిగా షేక్ మహమ్మద్ అం జద్, కార్యవర్గ సభ్యులుగా శివకుమార్ రాజు, వి మహే ంద్రబాబు, పి ద్వారక లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ప్రజలకు గోకులాష్టమి శుభాకాంక్షలు: ఎంపీ

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: గోకులాష్టమి సందర్భంగా చిత్తూరు పార్లమెంటు నియోజకవర్గం ప్రజలందరికీ చిత్తూరు ఎంపి దగ్గుమళ్ళ ప్రసాదరావు గోకులాష్టమి శు భాకాంక్షలు తెలిపారు. పార్లమెంటు నియోజక వర్గంలో సకాలంలో వర్షాలు కురవడంతో పాటు పాడి పంటలతో పల్లెలన్నీ పచ్చగా ఉండాలని కోరుకున్నామని నియోజకవర్గ ప్రజల కోరికలన్నీ నెరవేర్చాలని, పల్లె ప్రాంతాలలోని కుటుంబాన్నీ సుభిక్షంగా ఉండేలా కోరుకున్నానని చిత్తూరు ఎంపీ తెలిపారు.

వృద్ధులకు అన్నదానం

ప్రజాశక్తి- కార్వేటినగరం: ఆర్కేవిబి పేట పంచాయతీ ఇందిరా కాలనీకి చెందిన వీఎన్ జ్యోతి ప్రసాద్, ఫిజికల్ డైరెక్టర్ సతీమణి మార్గరేట్ పాలసముద్రం ఏపీవోగా పనిచేస్తున్నారు. వారి వివాహ దినోత్సవం సందర్భంగా ఆదివారం కుమారుడు సాయి చరిత్, కుమార్తె సహస్ర, వారి స్నేహితులు దినకర్ అడ్వకేట్ కుటుంబ సమేతంగా కార్వేటినగరం రాస్ వృద్ధాశ్రమంలో అన్నదానం, పండ్లు, స్వీట్, కేక్ పంపిణీ చేశారు.

ప్రత్యేక నేత్ర వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి-శాంతిపురం: రాళ్లబూదుగూరులో ప్రత్యేక నేత్ర వైద్య శిబిరాన్ని ఆదివారం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కుప్పం డెవలప్‌మెంట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మరమ్మత్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రజల ఆరోగ్య సంరక్షణ కోసమే రాళ్ళబూదుగూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రత్యేక నేత్ర వైద్య శిబిరం నిర్వహించామన్నారు. రాష్ట్రంలోనే ఎక్కడా ఈ కార్యక్రమం నిర్వహించలేదని కుప్పం నియోజకవర్గంలో మాత్రమే ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశానుసారం ఏర్పాటు చేశామని కడా ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్ తెలిపారు. ఈ సందర్భంగా ప్రత్యేక కంటి వైద్య శిబిరానికి వైద్య పరీక్షల కోసం వచ్చిన ప్రజలను పలకరిస్తూ కార్యక్రమంలో చురుగ్గా పాల్గొన్నారు. రానున్న రోజుల్లో ప్రజలకు మరిన్ని వైద్య సేవలకు సంబంధించిన వైద్య శిబిరాలను నిర్వహించి ప్రజలకు మెరుగైన ఆరోగ్య జీవితాన్ని గడపడానికి ఇలాంటి క్యాంపులు ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. అనంతరం 39 వ జాతీయ నేత్ర దాన పక్షోత్సవాల గోడ పత్రికను చూపుతూ, ఒకరి నేత్రదానం ఇద్దరి జీవితాలకు వెలుగు అని ప్రతిజ్ఞ చేయించి, నేత్రదానం చేయడం వల్ల మరొకరి కుటుంబంలో వెలుగులు నింపినట్టు అవుతుందని అందరూ నేత్రదానాన్ని అలవరుచుకోవాలని కోరారు. హెల్త్ క్యాంపులో 525 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. అందులో కాంట్రాక్ట్ ఆపరేషన్ కోసం 91



మందిని ఎంపిక చేశారు. 352 మందికి మెరుగైన కంటి చూపు కోసం కంటి అద్దాలు రాసి ఇచ్చారు. త్వరలో వారికి కంటి అద్దాలు అందిస్తామని తెలిపారు. 82 మందికి కంటిచూపు బాగా వుందని తెలిపారు. పలువురికి వైద్యుల సూచన మేరకు కంటి చుక్కల మందును మాత్రలను క్యాంపులో అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా డీఎంఅండ్‌హెచ్‌వో ప్రభావతి, డిప్యూటీ డిఎంహెచ్‌వో శ్రీనివాస్, జిల్లా ఇమేనేజెస్ ఆఫీసర్ హనుమంతరావు, తహశీల్దారు జి శివయ్య, ఎంపీడీవో ఏపీఆర్ కుమార్, డిప్యూటీ తహశీల్దారు కౌలేష్, సీనియర్ అసిస్టెంట్ యోగానంద్, డాక్టర్ శివకుమారి, డాక్టర్ ఉషారాణి, డాక్టర్ యశ్వంత్, జిల్లా కంటి వెలుగు ఆఫీసర్ డాక్టర్ అర్పిత, కంటి వైద్య నిపుణులు, టిడిపి నేతలు ఆర్ఎస్ మని, బసవరాజు, వాజిద్, కుమార్, జయరాజు, మురళి, అప్పి, రమేష్, రామచంద్రప్ప నాయుడు, వివిధ పంచాయతీ ల కార్యదర్శులు, వీఆర్వోలు, పలువురు నాయకులు, వైద్య సిబ్బంది, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

గ్రామ సభలు విజయవంతం: జనసేన

ప్రజాశక్తి- కుప్పం టౌన్ :

ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలతో ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ నాయకత్వంలో రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన గ్రామ సభలు విజయవంతం కావడం ఆనందంగా ఉందని కుప్పం నియోజకవర్గ జనసేన ఇన్‌ఛార్జి నరేష్ పేర్కొన్నారు. ఆదివారం కుప్పం పట్టణంలోని జనసేన కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత రెండు రోజులుగా రాష్ట్ర వ్యాప్తంగా 13,326 గ్రామ సభలు జరిగాయన్నారు. ముఖ్యంగా కుప్పం నియోజకవర్గంలో గతంలో ఎన్నడూ లేని విధంగా తూర్పు రాయలసీమ పట్టభద్రుల శాసనమండలి సభ్యులు డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ ఆధ్వర్యంలో ఎన్డీఏ కూటమి నాయకుల సహకారంతో నాలుగు మండలాలలోని ప్రతి గ్రామంలోనూ గ్రామసభలు విజయవంతంగా ముగిశాయన్నారు. గ్రామసభలు విజయవంతంగా ముగియడానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలకు అందుబాటులో ఉండాలన్న ఉప ముఖ్యమంత్రి ఆశయానికి అనుగుణంగా గ్రామ సభలు జరిగాయని, ప్రతి గ్రామంలోనూ ప్రతిరోజూ ప్రజలకు నాయకులు అందుబాటులో ఉంటామని ఈ సందర్భంగా తెలిపారు. ఉప ముఖ్యమంత్రిగా, అటవీ శాఖ మంత్రిగా పవన్ కళ్యాణ్ అంకిత భావంతో పని చేస్తున్నారని, అటవీ అభివృద్ధి కోసం మొక్కలు నాటి వాటిని పరిరక్షించే బాధ్యత చేపట్టడం హర్షణీయమన్నారు. ఆయన అడుగుజాడల్లో నడుస్తూ సెప్టెంబర్ రెండవ తేదీ పవన్ కళ్యాణ్ జన్మదినాన్ని పురస్కరించుకుని నియోజకవర్గ పరిధిలోని ప్రతి జన సైనికుడు మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహిస్తామని ఈ సందర్భంగా వారు తెలిపారు. ఈ సమావేశంలో స్థానిక జనసేన నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

శ్రీనివాస్ శర్మకు డాక్టరేట్



ప్రజాశక్తి- బంగారుపాళ్యం: బంగారుపాళ్యం మండలం మొగిలి గ్రామానికి చెందిన పాణ్యం శ్రీనివాస శర్మకు గౌరవ డాక్టరేట్‌ను భారత వర్చువల్ యూనివర్సిటీ ప్రదానం చేసిందని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పురోహితం ఆచార పద్ధతి కార్యక్రమ నిర్వాహణ, పురోహితం– సంస్కృతి సంప్రదాయ విధి విధానాలు పాటించడ, విషయ పరిజ్ఞాన సేకరణ గురించి వివరించినందుకు 'నీతి అయోగ్ (కేంద్ర ప్రభుత్వం) ఆఫ్ ఇండియా భారత్ వర్చువల్ యూనివర్సిటీ ద్వారా గౌరవ డాక్టరేట్ ప్రదానం చేశారని చిన్నప్పటి నుండి పంచాంగం శాస్త్రాలు అవగాహన చేసుకోవడం వల్ల వాటిని అవలీలగా ప్రజలకు తెలపడం వల్ల ఆ అనుభవంతో యూనివర్సిటీ నిర్వచించిన వర్చువల్స్ కార్యక్రమంలో పాల్గొని తెలిపానని , ఇందుకు డాక్టరేట్ ప్రదానం చేశారన్నారు.

సిఆర్‌పిలకు ప్రశంసా పత్రాలు బహూకరణ

ప్రజాశక్తి -సదుం : ప్రగతి సాధించిన 'లక్ పత్ దీ దీలకు, సిఆర్‌పి మహిళ లకు' ఆదివారం సదుం వెలుగు కార్యాలయంలో ఎపిఎం హరి ప్రసాద్, సీసీలు ప్రశంసా పత్రాలు అందిం చారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ దేశ వ్యాప్తంగా నిర్వహిం చిన లైవ్‌ను సదుం వెలుగు కార్యక్రమంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వెలుగు సిబ్బంది, సిఆర్‌పిలు, లక్ పత్ దీదీలు ఈ కార్యక్రమాన్ని వీక్షించారు. ఈ కార్యక్రమం లో ఎపిఎం హరి ప్రసాద్, సిసి రమేష్ పాల్గొన్నారు.



వృద్ధాశ్రమం నిర్మాణానికి శంకుస్థాపన



ప్రజాశక్తి-యర్రావారిపాలెం: చిన్నగొట్టిగల్లు మండలం రంగన్నగారిగడ్డ సమీపంలో ఉన్న కొల్లాపూరమ్మ గుడి ప్రాంతంలో ఇస్కాన్ ఆధ్వర్యంలో 500మంది వృద్ధులకు సరిపోయే వృద్ధాశ్రమం నిర్మాణానికి చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తినాని ఆదివారం భూమి పూజ చేశారు. మాజీ జెడ్పీ ఛైర్మన్ సిద్ధారామిరెడ్డి జ్ఞాపకార్థం వారి కుమారులు వి.వెంకట రెడ్డి, వి.కృష్ణారెడ్డిలు రూ.ఆరు కోట్ల సొంత నిధులతో హరే రామ హరే కృష్ణ వెంకటేశ నిలయం పేరుతో వృద్ధాశ్రమం నిర్మాణం చేపట్టడానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పులివర్తి నాని మాట్లాడుతూ డబ్బులు అందరికీ ఉన్నా సమాజ సేవ పేరుతో వృద్ధులకు వృద్ధాశ్రమం నిర్మాణానికి కోట్లు ఖర్చు పెట్టడానికి గొప్ప మనసు ఉండాలన్నారు. ప్రభుత్వం తరపున ఈ వృద్ధాశ్రమ నిర్మాణానికి ఎటువంటి సహాయ సహకారాలు కావాలన్నా అందిస్తామని హామీ ఇచ్చారు. చిన్నగొట్టిగల్లు, ఎర్రవారిపాలెం, రొంపిచర్ల మండలంలో అనాథ వృద్ధులకు అన్ని రకాల సదుపాయాలతో మంచి వాతావరణంలో ఇలాంటి నిర్మాణం చేపట్టడం ఎంతో గొప్ప విషయం అని తిరుపతి ఇస్కాన్ ప్రెసిడెంట్ రేవతి రమణదాసు పేర్కొన్నారు. ఇలాంటి మంచి వాతావరణంలో వృద్ధాశ్రమ నిర్మాణం చేపట్టడం గొప్ప సేవ అని టిడిపి పుంగనూరు ఇన్‌ఛార్జ్ చల్లా బాబు దాతలను కొనియాడారు. ఎంతో డబ్బు సంపాదించిన పేద ప్రజలకు తన వంతు సహాయంగా తన తండ్రి సిద్ధారామిరెడ్డి జ్ఞాపకార్థం తలకోనలో రెండు కోట్లతో అన్నదాన సత్రం, రూ.ఆరు కోట్ల వ్యయంతో వృద్ధాశ్రమం నిర్మించడం ఎంతో సంతోషంగా ఉందని ఫౌండర్ వెంకట్ రెడ్డి అన్నారు. కార్యక్రమంలో పీలేరు మాజీ ఎమ్మెల్యే శ్రీనాథ్ రెడ్డి, మాజీ ఎంపీ అయోధ్య రామిరెడ్డి, టిడిపి నాయకులు, కార్యకర్తలు ఇస్కాన్ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

కళా ఉత్సవాలను జయప్రదం చేయండి: జింక నాగరాజు



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న కళాకారులు

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: గ్రామీణ జానపద ప్రజా కళా ఉత్సవాలను జయప్రదం చేయాలని ఏపీ ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి జింక నాగరాజు తెలిపారు. ఆదివారం మండలంలోని అయ్యర్ కండ్రిగ గ్రామంలో భజన కోలాట కళాకారుల ఆధ్వర్యంలో కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా జింక నాగరాజు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల్లో కనుమరుగైపోతున్న గ్రామీణ జానపద కళాకారులైన పండరి భజన, బృందావన భజన, చెక్క భజన, కోలాట భజన కళాకారులను ప్రభుత్వాలు పట్టించుకోకపోవడం వల్ల అత్యంత ప్రాధాన్యత ప్రాచీన కళలు కనుమరుగైపోతాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కళలను బతికించడానికి ప్రభుత్వాలు బాధ్యతాయుతంగా చూడాలన్నారు. సమాజానికి ఎంతో ఆనందాన్ని కలిగింపజేసే భక్తిరస కళాకారులకు ప్రభుత్వం గుర్తింపు కార్డులు మంజూరు చేసి ప్రతి కళాకారునికి మూడు సెంట్లు ఇంటి స్థలంతో పాటు ఇంటి నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు. టీటీడీ లాంటి ధార్మిక సంస్థలలో దేవుని ఉత్సవాలలో గ్రామీణ భక్తిరస కలలైనా భజన కోలాట బృందాలకు ప్రదర్శనలు ఇవ్వడానికి అనుమతిని ఇవ్వాలని ఆయన కోరారు. సమాజం అత్యంత నాగరికతగా పెరగడానికి కళలు సంప్రదాయాలు ఎంతో తోడ్పాటు అందించాలని కళల ద్వారానే మన సంస్కృతి ఉట్టిపడుతున్నదని ఆయన గుర్తు చేశారు. ఇలాంటి గ్రామీణ కళాకారులను ప్రభుత్వం అన్ని విధాల ఆదుకోవాలని కోరారు. ఈనెల 31వ తేదీన శ్రీకాళహస్తి పట్టణంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ భవన్లో జరిగే ప్రజా కళా ఉత్సవాలకు కళాకారులు పెద్ద సంఖ్యలో హాజరై కళా ఉత్సవాలను జయప్రదం చేయవలసిందిగా ఆయన విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఏపీ ప్రజానాట్యమండలి కోలాటం గురువు ముకుంద, కోలాటం గౌరవ అధ్యక్షులు డి.మహేష్, ఏఐటియుసి డివిజన్ కార్యదర్శి గోపి, కోలాట బృందం నాయకులు దేశమ్మ, సుబ్బమ్మ, అలివేలు, రవి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఫుట్ బాల్ టోర్నమెంట్‌లో బిన్నీ బెంగళూరు జట్టు విజయం



ప్రజాశక్తి-రేణిగుంట: పట్టణంలోని రైల్వే ఇన్స్టిట్యూట్ మైదానంలో జరుగుతున్న సౌత్ ఇండియన్ ఫుట్ బాల్ సెవెన్స్ టోర్నమెంట్లో బిన్నీ బెంగుళూరు సెవెన్స్ జట్టు ఘన విజయం సాధించింది. ఆదివారం రైల్వే ఇన్స్టిట్యూట్ మైదానంలో జరిగిన ఫుట్బాల్ టోర్నమెంట్ ఫైనల్‌కు చేతపట్టు చెన్నై సెవన్స్ జట్టు బిన్నీ బెంగళూరు జట్టు చేరాయి. ఉత్కంఠ భరితంగా సాగిన ఫైనల్ పోరులో బిన్నీ బెంగళూరు జట్టు చేతపట్టు చెన్నై జట్టు నిర్ణీత సమయానికి ఇరుజట్లు గోల్స్ సాధించికపోవడం టై బ్రేక్ చేశారు. దీంతో అంపైర్లు ఇరుజట్లకు షూట్ అవుట్ పిలుపునిచ్చారు. షూట్ అవుట్‌లో బెంగళూరు జట్టు నాలుగు గోల్స్ సాధించగా చేత పట్టు చెన్నై జట్టు మూడు గోల్స్ సాధించింది. దీంతో బిన్నీ బెంగళూరు జట్టు విజయం సాధించి ట్రోఫీతో పాటు రూ.40వేల ప్రైజ్ మనీ సాధించింది. టోర్నమెంటులో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన బిన్నీ బెంగళూరు సేవెన్స్ క్రీడాకారుడు నితీష్ స్టాపర్ బ్యాట్ అవార్డు అందుకున్నారు. ట్రోఫీలో ఘనవిజయం సాధించిన బిన్నీ బెంగళూరు జట్టు, చేతపట్టు చెన్నై జట్టును టోర్నమెంట్ ఆర్గనైజర్లు సీనియర్ ఫుట్బాల్ క్రీడాకారులు అతిథులు అభినందించారు. బిన్నీ బెంగళూరు జట్టు క్రీడాకారులు ఆనంద ఉత్సాహాలతో సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో ఎంఎ జబ్బర్ ట్రస్ట్ అధినేత డాక్టర్ ఫరీద్ బాబా, ఈజ్ మై ట్రిప్ ప్రమోద్, జెరూసలేం అపోస్తలిక ప్రార్థన మందిరం పాస్టర్ రెవరెండ్ డేవిడ్, టోర్నమెంట్ ఆర్గనైజర్లు బాబు, రెడ్డప్ప, దేవదహనం, ఉష, ఉమా, సామ్యూల్, రాజేష్ పాల్గొన్నారు.

స్పేస్ క్విజ్‌లో లోకో పైలట్ మణి ప్రతిభ



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: నేషనల్ స్పేస్ డే క్విజ్‌లో తొట్టంబేడు మండలం పూడి గిరిజన కాలనీకి చెందిన కంపా మణి ప్రతిభ చూపారు. నేషనల్ వాటర్ అకాడమీ, సెంట్రల్ వాటర్ కమిషన్ సంయుక్తంగా నిర్వహించిన ఆన్లైన్ నేషనల్ స్పేస్ డే క్విజ్‌లో లోకో పైలట్‌గా పనిచేస్తున్న కంపా మణి తృతీయ స్థానం సాధించి సర్టిఫికెట్‌తో పాటు రూ.50వేలు పారితోషక నగదును పొందారు. ఆయనకు పలువురు ప్రశంసలు, అభినందనలు తెలిపారు.

వైభవంగా దుర్యోధన వధ



ప్రజాశక్తి-రామచంద్రాపురం: మండలంలోని సి.రామాపురం, ఎన్ఆర్ కమ్మపల్లిలో మహాభారత ఉత్సవాల్లో భాగంగా ఆదివారం దుర్యోధన వద సాంస్కృతిక ఘటం వైభవంగా జరిగింది. దుర్యోధని పాత్రలు యుగంధర్, కిరణ్, భీముని పాత్రలు కొట్టే వేణునాధరెడ్డి, అశోక్‌లు పోషించారు. గంగ మడుగులో దాక్కుని ఉన్న దుర్యోధనుని భీముడు లాక్కుని వచ్చి యుద్ధం చేసిన పౌరాణిక ఘటంలో కళాకారులు పాడిన మహాభారత పద్యాలు, పాటలు ప్రేక్షకులను ఆకట్టుకుంది. దుర్యోధన వద సాంస్కృతిక కార్యక్రమాన్ని తిలకించడానికి వివిధ ప్రాంతాల నుంచి ప్రేక్షకులు భారీగా హాజరయ్యారు. ఆలయ నిర్వహకులు అన్నదాన చేపట్టారు. భక్తులు అగ్నిగుండ ప్రవేశ కార్యక్రమం ఆదివారం సాయంత్రం నిర్వహించారు.

పట్టువస్త్రాల సమర్పణ

ద్రౌపది సమేత ధర్మరాజుల స్వామి మహాభారత ఉత్సవాల సందర్భంగా ఆదివారం చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి వెంకట మణి ప్రసాద్, (నాని), మబ్బు దేవనారాయణరెడ్డిలు అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు, ఆలయ అర్చకులు వేదమంత్రా లతో ఆశీర్వదించి దుశ్శాలువలతో సత్కరించి తీర్థ ప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో కె.రామిరెడ్డి, ఎం.తిరుమలరెడ్డి, సి.జనార్ధన్ చౌదరి, టి.కేశవ నాయుడు, మధు రెడ్డి, రంజిత్ కుమార్, వెంకటకృష్ణారెడ్డి, సురేష్ రెడ్డి, కె.ముద్దు కృష్ణారెడ్డి, నరసింహారెడ్డి, చేకూరి రవికుమార్, కే.ధనంజయ రెడ్డి, కె.గిరిధర్ రెడ్డి పాల్గొన్నారు.

నేడు పుష్పయాగం

మహాభారత ఉత్సవాల్లో భాగంగా చివరి రోజున నిర్వహించే పుష్ప యాగం కార్యక్రమాన్ని సోమవారం ఉదయం 10గంటలకు నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వహకులు తెలిపారు. పుష్పయాగంతో మహాభారత ఉత్సవాలు ముగియనున్నాయి.

కరాటే సాధనతో ఆత్మరక్షణ, ఆత్మ విశ్వాసం

సిఐ మురళి నాయుడు



ప్రజాశక్తి-సత్యవేడు: కరాటే సాధనతో ఆత్మరక్షణ, ఆత్మ విశ్వాసం పెరుగుతుందని సత్యవేడు సిఐ మురళినాయుడు అన్నారు. ఆదివారం పట్టణంలోని బాలుర పాఠశాల కళావేదిక వద్ద ఏర్పాటు చేసిన కొబ్రో, కరాటే వెపన్స్ ట్రైనింగ్ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు, ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ.. కరాటే మెరుగైన శారీరక దృఢత్వం, బలం, సమన్వయంతో సహా అనేక ప్రయోజనాలను అందిస్తుందని, ఇది అభ్యాసకులకు స్వీయ రక్షణ నైపుణ్యాలను పుష్కలంగా లభిస్తాయని, ఆత్మవిశ్వాసం క్రమ శిక్షణను పెంచడానికి కరాటే ఎంతో దోహద పడుతుందన్నారు. అదనంగా కరాటే అభ్యాసం ఒత్తిడిని తగ్గించడాని, మానసిక దృష్టిని మెరుగు పరచడానికి గొప్ప మార్గం అని చెప్పారు. విద్యార్థులు చదువుతోపాటు కరాటేలోనూ రాణించాలని ఆయన సూచించారు. కార్యక్రమం లో కరాటే మాస్టర్లు జాన్సన్, సుబ్రహ్మణ్యం, ఎలుమలై, రమేష్, ఏకే బాబు, ప్రేమ్ కుమార్, పరంధామన్, శ్రీనివాసన్ పాల్గొన్నారు.

ముందస్తు జాగ్రత్తలతో కళ్ళను కాపాడుకోవచ్చు: డాక్టర్ శ్రీనాథ్



సమావేశంలో ప్రసంగిస్తున్న డాక్టర్ శ్రీనాథ్

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: ముందస్తు వైద్య పరీక్షలు చేసుకుంటే కళ్ళను కాపాడుకోవచ్చని తిరుపతికి చెందిన అరవింద్ హాస్పిటల్ డాక్టర్ శ్రీనాథ్ తెలిపారు. ఆదివారం పుత్తూరు వాకర్స్ అసోసియేషన్ నెలవారి సమావేశం అసోసియేషన్ అధ్యక్షులు కేఎల్ మూర్తి అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్యఅతిథిగా తిరుపతి అరవింద్ హాస్పిటల్ డాక్టర్ శ్రీనాథ్ పాల్గొని మాట్లాడుతూ.. ప్రస్తుతం 40సంవత్సరాల వయసుకే షుగరు, బిపి వంటి వ్యాధులు వల్ల కంటి జబ్బులు వచ్చే అవకాశం ఉందన్నారు. మొదటి దశ గ్లూకోమా (మసక మసక) వ్యాధులు వస్తాయని అన్నారు. తరువాత వయస్సు పెరిగే కొద్దీ కంటిలో నరాలు బలహీనత చెందుతుంది, శుక్ల వ్యాధి, అనంతరం రెటీనా దెబ్బతిని కంటిచూపు కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. కావున ప్రతి ఒక్కరు 40సంవత్సరాల నుంచి కంటి పరీక్షలు చేసుకోవాలన్నారు. దీనికి ప్రైవేటు హాస్పిటల్లో వైద్య పరీక్షలు చేసుకుంటే ఎక్కువ ఫీజులు వసూలు చేస్తారని, అదే అరవింద్ హాస్పిటల్ వైద్య పరీక్ష చేసుకుంటే ఉచితంగా చేస్తారని తెలిపారు సమావేశంలో వాకర్స్ అసోసియేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ శ్రీనివాసులు రెడ్డి, కార్యదర్శి మునికృష్ణయ్య, కౌన్సిలర్ వాకర్స్ సభ్యులు నరసింహారావు, మాజీ అధ్యక్షులు రామచంద్ర నాయుడు, మురుగేష్ రెడ్డి, వాకర్ సభ్యులు పాల్గొన్నారు.

విజయవంతంగా రక్తదాన శిబిరం



ప్రజాశక్తి-ఏర్పేడు: యువ సమాజ్ నిర్మాణ్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పేడు మండలం వెంకటగిరి రోడ్డు సంత మైదానంలో తిరుపతి రుయా బ్లడ్ బ్యాంక్ సిబ్బంది పర్యవేక్షణలో సంస్థ ప్రతినిధులు పిలుపు మేరకు రక్తదాన శిబిరంలో స్వచ్ఛందంగా రక్త దాతలు, సంస్థ సభ్యులు 35మంది రక్తదానం చేయడం జరిగింది. కార్యక్రమంలో సంస్థ రాష్ట్ర అధ్యక్షులు తాళిక్కాల్ వెంకటేశ్వర్లు, సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్ గానుగ పెంట రమేష్, ఎంజెఆర్ ప్రిన్సిపాల్ కేఎన్వి రావు, పాత వీరాపురం విఆర్వో బాబు, రక్త దాతలు, సిబ్బంది పాల్గొన్నారు.

రేపటి నుంచి గంగ జాతర

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: పట్టణంలో గంగ జాతర ఉత్సవాలను ఈ నెల 27వ తేదీ నుంచి సెప్టెంబర్ 4వ తేదీ వరకు అత్యంత వైభవంగా నిర్వహించడం జరుగుతుందని ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. ఆదివారం వారు పట్టణ కేంద్రంలో గోడపత్రాలు ఆవిష్కరించారు. అందులో భాగంగా 27వ తేదీ మంగళవారం ఉదయం 5గంటల నుంచి 11గంటల వరకు గ్రామ దేవత శ్రీ ఆరేటమ్మకు విశేష అభిషేకాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. అలాగే అదే రోజు రాత్రి గంగ జాతర చాటింపు,వచ్చే నెల 1వ తేదీ నుంచి 3వ తేదీ వరకు గెరిగ పుర వీధుల్లో ఊరేగింపు, 3వ తేది మంగళవారం రాత్రి చాటు బండి ఊరేగింపు, 4వ తేదీ గంగ జాతరను నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. అదే రోజు సాయంత్రం పాట కచ్చేరి ఉంటుందని తెలిపారు. అనంతరం జాతరకు సంబంధించిన గోడకర పత్రాలు విడుదల చేశారు.



వైసీపీ నాయకుల ప్రవర్తన విడ్డూరం

- అవినీతికి పాల్పడ్డ ప్రతి ఒక్కరి లెక్కలు తేలుస్తాం: కిషోర్ నాయుడు



ప్రజాశక్తి-చిట్టమూరు: మండల పరిషత్ కార్యాలయం ఆవరణంలోనీ స్త్రీ శక్తి భవన్లో శనివారం నిర్వహించిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో చిట్టమూరు మండలం ఉపాధ్యక్షులు బివి రమణయ్య మాట్లాడడం విడ్డూరంగా ఉందని టీడీపీ మండల పార్టీ అధ్యక్షులు గణపర్తి కిషోర్‌నాయుడు అన్నారు. ఆదివారం టిడిపి మండల పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా కిషోర్ నాయుడు మాట్లాడుతూ గతంలో ప్రతి గ్రామపంచాయతీలో ఫీల్డ్ అసిస్టెంట్ పొదుపు సంఘాల ద్వారా వివోఏలుగా పనిచేస్తుంటే ఆనాటి టీడీపీ ప్రభుత్వం ఏ ఒక్కరినీ విధులు నుంచి తొలగించకుండా వారిని యధావిధిగా ఆయా శాఖల పనులలో కొనసాగించారన్నారు. అయితే 2019 ఎన్నికలలో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మూడు రోజుల్లోనే సాక్షాత్తు ప్రస్తుత ఎంపీపీగా ఉన్న వారి పంచాయితీలోనే ఫీల్ అసిస్టెంట్లను, వివోఏలను మొదలు పాఠశాలల్లో చిమ్ముకునే చిపరరాల వరకు మార్చి వైసీపీ కార్యకర్తలను నియమించుకున్న ఘనత వారిది కాదా అని కిషోర్ నాయుడు ప్రశ్నించారు. ప్రతి పంచాయతీలో టీడీపీకి పని చేసిన వారిని కక్ష కట్టుకొని వైసీపీ నాయకులు ఆరోజు తొలగించారన్నారు. తొందరలోనే వైసిపి ప్రభుత్వంలో చిట్టమూరు మండలంలో పేదల భూములను దౌర్జన్యంగా అధికారులను అడ్డుపెట్టుకొని అక్రమంగా పేదల భూములను ఆక్రమించుకున్న అన్నింటినీ తమ నాయకుడు గూడూరు ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ దృష్టికి తీసుకుని ప్రతి ఒక్కరి లెక్కలు తేలుస్తామని ఎంతటి వారినైనా వదిలే ప్రసక్తే లేదన్నారు. అలాంటివన్నీ బయటికి తీస్తామనే ఉద్దేశంతోనే వైసీపీ నాయకులు తాటాకు చప్పులు చేస్తున్నారని ఇలాంటి వాటికి భయపడే ప్రసక్తే లేదన్నారు.

గ్రామీణాభివృద్ధే పవన్ కళ్యాణ్ లక్ష్యం: మనోహర్



ప్లే కార్డులను ప్రదర్శిస్తున్న జనసేన నాయకులు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): రాష్ట్రంలోని అన్ని పంచాయతీలు సమగ్ర అభివృద్ధిగా ముందుకు వెళ్లాలని లక్ష్యంతో డిప్యూటీ సీఎం కొణిదల పవన్ కళ్యాణ్ ప్రత్యేక ప్రణాళికతో కార్యక్రమాలను నిర్వహిస్తున్నారని జనసేన పార్టీ చంద్రగిరి నియోజకవర్గ బాధ్యులు దేవర మనోహర్ అన్నారు. ఆదివారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. గతంలో వైసీపీ హాయంలో సర్పంచులను రబ్బర్ స్టాంపులుగా మార్చారని, కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో అధికారంలోకి రావడం గ్రామాలే దేశానికి పట్టుకొమ్మలు అనే నినాదానికి వాస్తవ రూపాన్ని తీసుకురావడానికి పవన్ కళ్యాణ్ నిర్వహించిన ఉపాధి హామీ గ్రామసభలు నిదర్శనం అన్నారు. చంద్రగిరి నియోజకవర్గంలోని 119గ్రామ పంచాయతీలలో అభివృద్ధి కోసం చేస్తున్న ప్రణాళికాబద్ధమైన కార్యక్రమాలతో జనసేన పార్టీ వైపు మక్కువ చూపుతున్నారని అన్నారు. మునుపెన్నడు ఏ నాయకుడు చేయని విధంగా గ్రామాలను అభివృద్ధి చేయడానికి పవన్ కళ్యాణ్ ప్రత్యేక వ్యూహాన్ని తయారు చేసుకున్నారన్నారు. ఆ దిశగా నిర్వహించిన గ్రామసభలు దేశ ప్రధానమంత్రి మెప్పును అందుకున్నాయన్నారు. సెప్టెంబర్ 2 పవన్ కళ్యాణ్ పుట్టినరోజు సందర్భంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నమన్నారు. పర్యావరణ సమతుల్యత ఎంతో ప్రధానమని భావించిన పవన్ కళ్యాణ్ పరిరక్షణ చర్యలను చేపట్టారన్నారు. గ్రామాలు ఇకపై పూర్తిస్థాయిలో అభివృద్ధి చెందడానికి స్వేచ్ఛాయుత వాతావరణాన్ని కూటమి ప్రభుత్వం కల్పించిందన్నారు. ఈ విలేకరుల సమావేశంలో సాయి, మురళి, హరి, విజయనిర్మల పాల్గొన్నారు.

రక్తదానం సామాజిక బాధ్యత

ప్రజాశక్తి-గూడూరు టౌన్: రక్తదానం సామాజిక బాధ్యత అని జనసేన పార్టీ లీగల్ సెల్ రాష్ట్ర కార్యదర్శి, ఉమ్మడి నెల్లూరు జిల్లా ఉపాధ్యక్షులు తీగల చంద్రశేఖర్ రావు కోరారు. డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ జన్మ దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా ఆదివారం గూడూరు జనసేన పార్టీ కార్యాలయంలో రెడ్ క్రాస్ సౌజన్యంతో భారీ రక్తదాన శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో పీఓసీ మోహన్, జనసేన నాయకులు భాస్కర్, శివ, నాగార్జున, మనోజ్ పాల్గొన్నారు.

ప్రతి గ్రామంలో జనసేన జెండా



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: ప్రతి గ్రామంలో జనసేన జెండా ఎగరవేస్తామని ఆ పార్టీ శ్రీకాళహస్తి నియోజకవర్గ ఇంచార్జి కోటా వినుత అన్నారు. తొట్టంబేడు మండలం చిట్టతూరు పంచాయతీలో ఆదివారం వినుత జనసేన జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల అనంతరం రాష్ట్రంలోనే మొట్ట మొదటి జనసేన జెండా ఆవిష్కరణ శ్రీకాళహస్తి నియోజకవర్గంలో నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. ఇదే స్ఫూర్తితో ప్రతి గ్రామంలో జనసేన జెండా ఎగురుతుందని స్పష్టం చేశారు. వచ్చే ఎన్నికలకు జనసేన లక్ష్యాలను, సిద్ధాంతాలను ప్రజలకు తీసుకెళ్లడమే ప్రధాన అజెండాగా ముందుకెళ్లనున్నట్లు వివరించారు. తొట్టంబేడు మండల అధ్యక్షుడు పేట చంద్ర శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఎన్‌పిఎల్ క్రికెట్ టోర్నమెంట్



ప్రజాశక్తి- కుప్పం రూరల్ : కుప్పం నందమూరి తారక రామారావు క్రీడ మైదానంలో జరుగుతున్న కొత్తపేట ఐపీఎల్ మ్యాచ్ ఆదివారం ముగిసింది. ఈ పోటీలలో జల్సా బాయ్స్ టీం గెలుపొందినట్టు క్రీడా నిర్వాహకులు తెలిపారు. ఈ పోటీలలో గెలుపొందిన వారికి ఐపీఎల్ ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన కుప్పం నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి పి ఎస్ మునిరత్నం ట్రోఫీతో పాటు 31,111 రూపాయల నగదు బహుమానాన్ని సైతం అందించారు. ఈ కార్యక్రమంలో స్థానిక టిడిపి నాయకులు గోపినాథ్, సతేంద్ర శేఖర్, చెక్కునత్తం మణి, సంతోష్, సోము, మంజునాథ్, అప్పు, ఇర్ఫాన్, లయన్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

యాదవ ఎంప్లాయీస్ సొసైటీ మండల కార్యవర్గ ఎన్నిక

ప్రజాశక్తి -గంగాధర నెల్లూరు: గంగాధర నెల్లూరు మండలంలో యాదవ ఎంప్లాయీస్ సొసైటీ మండల కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఈ కార్యవర్గం ఎన్నిక గంగాధర నెల్లూరు నియోజకవర్గ అధ్యక్షుడు గురుమూర్తి యాదవ్ ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. మండల ఎంప్లాయీస్ సొసైటీ అధ్యక్షుడు సుబ్రహ్మణ్య యాదవ్, దేవరాజులు యాదవ్ ,ప్రధాన కార్యదర్శి ఢిల్లీ ప్రకాష్ యాదవ్ ఉపాధ్యక్షులుగా భూషణ్ యాదవ్, శేషాద్రి యాదవ్, సుబ్రహ్మణ్య యాదవ్ ,కోశాధికారి భాస్కర్ యాదవ్ ,మహిళా కార్యదర్శి హంస, కార్యదర్శులుగా కుమారి ,జోష్ణ ,రవి ,సోము, యశ్వంత్ ను ఎన్నుకున్నారు.

యోగ జిల్లా స్థాయి పోటీలకు ఆహ్వానం

ప్రజాశక్తి- కుప్పం రూరల్ : కుప్పంలో వచ్చే నెల 3వ తేదీ నిర్వహించనున్న జిల్లా స్థాయి యోగ పోటీలలో పాల్గొనడానికి ఔత్సాహికులను ఆహ్వానిస్తున్నట్లు విశ్వశాంతి యోగాశ్రమ నిర్వాహకులు, యోగ శిక్షకులు గణేష్ తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ యోగ గురువు, విశ్వశాంతి యోగ ఆశ్రమ వ్యవస్థాపకులు గోపీనాథ్ యోగి జయంతిని పురస్కరించుకుని సెప్టెంబర్ మూడవ తేదీ విశ్వశాంతి యోగ ఆశ్రమంలో జిల్లా స్థాయి యోగా పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ పోటీలు సబ్ జూనియర్స్, జూనియర్స్ కేటగిరీలుగా నిర్వహించనున్నామన్నారు. ఇందులో సబ్ జూనియర్ కేటగిరిలో 8 నుండి 12 సంవత్సరాల వయస్సు గలవారు, జూనియర్స్‌లో 13 నుండి 19 సంవత్సరాల మధ్య వయసు వారు పాల్గొనటానికి అర్హులని తెలిపారు. ఈ పోటీలలో పాల్గొన్న వారికి ప్రతిభ ధ్రువీకరణ పత్రాలను అందించడంతో పాటు, రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొనే అవకాశం ఉంటుందని తెలిపారు. ఆసక్తి కలిగినవారు ఆగస్టు 31వ తేదీ లోపు తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 9989093290 నెంబరును సంప్రదించాలని సూచించారు.

'ప్రభుత్వ సాయంతో మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి'

ప్రజాశక్తి - రామకుప్పం: రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలను స్వయం సహకార సంఘం మహిళలు సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా అభివృద్ధి సాధించాలని టిడిపి మండల అధ్యక్షుడు ఆనంద రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ చిన్నకృష్ణ, నియోజకవర్గ తెలుగు రైతు అధ్యక్షుడు చలపతి పేర్కొన్నారు. ఆదివారం శ్రీ శక్తి భవనం వద్ద స్వయం సహాయక సంఘాల లీడర్లు, మహిళలతో ఆదివారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పేద మహిళల కోసం ప్రతిష్టాత్మకంగా తీసుకొస్తున్న లక్‌పతి దీదీ వందరోజుల కార్యక్రమంలో మహిళలందరూ భాగస్వామ్యమై బ్యాంకులో రుణాలు పొంది చిన్న చిన్న పరిశ్రమలుగా ఏర్పాటు చేసుకొని అభివృద్ధి చెందాలన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ముఖ్యమంత్రి చంద్రబాబు పురుషులతో సమానంగా మహిళలు కూడా ఆదాయం పొందాలని వివిధ పథకాలు అందించి ప్రోత్సహిస్తున్నారన్నారు. అనంతరం మహిళలకు చెక్కులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నారాయణ చారి, రమేష్ బాబు, గిరి దాస్, విశ్వనాథ్, వెంకటరమణ, సుబ్రి, పెరుమాళ్, అల్లి శీన, మంజునాథ్, పద్మమ్మ, ఏపీవో లావణ్య, స్వయం సహాయక సహకార సంఘ మహిళలు పాల్గొన్నారు. **సోమల:** మండలంలోని 22 మహిళా సంఘాలకు రెండు కోట్ల 88 లక్షల రూపాయల బ్యాంకు రుణాలను పంపిణీ చేశామని ఏపిఎం శివ తెలిపారు. ఆదివారం మండల కేంద్రమైన సోమల ఎంపీడీవో కార్యాలయ సమీపంలోని సమావేశపు మందిరంలో నిర్వహించిన మహిళా సంఘాల సమావేశం కార్యక్రమంలో ఇరికిపెంట మాజీ సర్పంచ్ టిడిపి నాయకులు కరణం శ్రీనివాసులు, మహేంద్ర, భాగ్యమ్మ, అష్రఫ్ మహిళా సంఘాలకు చెక్కును పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా ఎదగాలన్న ఉద్దేశంతో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వారికి బ్యాంకు రుణాలను అందజేస్తూ వారి అభివృద్ధికి తోడ్పడుతున్నారని ప్రభుత్వం అందిస్తున్న రుణాలను మహిళా సంఘాలు మహిళలు సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదిగి కుటుంబాలను ఉన్నత శిఖరాలకు చేర్చే విధంగా రుణాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఏపీఎం శివ మాట్లాడుతూ లక్పతి దిది ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించామని ఎవరైనా మహిళలు తాము ఆర్థికంగా ఎదుగుతామన్న సంకల్పంతో సంఘాల ద్వారా రుణాలు పొందాలనుకుంటే సంఘమిత్రలను సీసీలను సంప్రదించి ఆర్థికంగా లబ్ధి పొంది రుణాలను తిరిగి సకాలంలో చెల్లించి ఆర్థిక అభివృద్ధికి బాటలు వేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో శంకర, వెంకట రత్న, బాబు వెలుగు సిబ్బంది సంఘమిత్రలు పాల్గొన్నారు.

అంధకారంలో విందూరు ఎస్టీ కాలనీ





- పట్టించుకోని అధికారులు
- సమస్యలను వెంటనే పరిష్కరించాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు వందవాసి నాగరాజు డిమాండ్

ప్రజాశక్తి-గూడూరు టౌన్: గూడూరు రూరల్ మండల పరిధిలోని విందూరు గ్రామం "ఎస్టీ"గిరిజన కాలనీలో అనేక సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు వందవాసి నాగరాజు పేర్కొన్నారు. ఎస్టి గిరిజన కాలనీ గ్రామంలో పర్యటించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్టీ కాలనీలో అనేక సమస్యలు తమ దృష్టికి వచ్చాయని తెలిపారు. గ్రామం మొత్తంలో 150కుటుంబాలు పైగా నివసిస్తున్నారు. అందులో సగం మందికి పైగా కరెంటు కొరతను ఎదుర్కొంటున్నారన్నారు. గత 15 సంవత్సరాల నుంచి విద్యుత్ సంబంధిత అధికారులు కరెంటు స్తంభాలు వేయకపోవడం, ఎన్నిసార్లు వినతి పత్రాలు ఇచ్చినా, నేరుగా వెళ్లి తమ గోడు చెప్పుకున్నా అధికారుల నుంచి స్పందన రాకపోవడంతో అక్కడ ప్రజలు అంధకారంలో విష సర్పాల మధ్య జీవనం సాగిస్తున్నారన్నారు. కాలనీలో కరెంటు స్తంభాలు ఒక్కొక్క స్తంభానికి మధ్య 300మీటర్లు దూరంలో ఉన్నాయి. కరెంటు మీటర్ బిగించుకోవాలి అని అనేకసార్లు అధికారులకు వినతి పత్రాలు ఇచ్చిన స్పందించలేదని కరెంట్ మీటర్లు బిగించలేదు అన్నారు. కరెంటు స్తంభాలు అందుబాటులో లేకపోవడంతో అక్కడ నివసించే ప్రజలు నానా ఇబ్బందులకు గురవుతున్నారు. అధికారులు వెంటనే స్పందించి అక్కడ కరెంటు స్తంభాలు వేసి, వారిని చీకటి, విష సర్పాల నుంచి విముక్తి కలిగించాలని తెలిపారు. అలాగే సిమెంట్ రోడ్లు ఏర్పాటు చేయాలని వర్షం వస్తే బురదలో నీటిలో నడుచుకుంటూ వెళ్లాల్సిన పరిస్థితి ఉందన్నారు. వెంటనే సమస్యలును పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు పి.శ్రీనివాసులు, నారాయణ, వెంకటయ్య, రాజన్న తదితరులు పాల్గొన్నారు.

రచయిత్రి ఉషారాణికి జాతీయ పురస్కారం



ప్రజాశక్తి-చిన్నగొట్టిగల్లు: స్థానిక భాకరాపేటకు చెందిన ధనాసి ఉషారాణికి భారతీయ తెలుగు రచయిత్రుల సమాఖ్య కేశవ రెడ్డి సంస్థలచే తెలుగు వైభవం పేరుతో తెలుగు భాష మీద కవి సమ్మేళనాన్ని సుమారు వంద మంది కవులచే ఘనంగా నిర్వ హించారు. దీన్ని మారిషష్ రికార్డ్‌లో నమోదు చేయడం జరి గింది. తెలుగు భాష మీద కవితా గానం చేసి తెలుగు భాష జాతీయ పురస్కారంను ప్రముఖులు మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ మనువడు సుబ్రమణ్య శర్మ, సీని కథకులు చిన్ని క్రిషన్న, గోరెటి వెంకన్న చేతులు మీదుగా చిత్తురులోని టిటిడి కల్యాణ మండపంలో జరిగిన సమావేశంలో అందుకున్నారు. పలువురు కవులు, స్థానికులు ఆమెను అబినందించారు.

మనోరంజితంకి నివాళి

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: నగరి నియోజకవర్గ వాణిజ్య కార్యదర్శి, పుత్తూరు మున్సిపాలిటీ 19వ వార్డు టిడిపి ఇన్‌ఛార్జ్ ముమ్మడి కృష్ణ కుమార్ తల్లి మనోరంజితం అనారోగ్యంతో శనివారం రాత్రి మృతి చెందారు. పుత్తూరు మండల టీడీపీ శ్రేణులు శ్రీకాళహస్తి పట్టణంలోని స్వగృహంలో ఆమె భౌతికకాయానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో రవికుమార్, హమీద్ బాషా, హేమాద్రి, రిపోర్టర్ అభి, మహమ్మద్ రఫీ, వార్తల రజని నాయకులు, పాల్గొన్నారు.

'డ్వాక్రా మహిళలను లక్షాధికారులను చేయడమే లక్ష్యం'

ప్రజాశక్తి-దొరవారిసత్రం: డ్వాక్రా గ్రూపుల సభ్యులకు రూ.లక్ష ఆర్థిక సాయం అందించి చిన్న తరహా వ్యాపారాలతో లక్షాధికారులను చేయడమే "లక్ పతి దిది" పథకం ప్రధాన ఉద్దేశం అని వెలుగు ఏపీఎం పద్మావతి తెలిపారు. ఆదివారం మండల పరిషత్ సమావేశ భవనంలో ఈ కార్యక్రమాన్ని పురస్కరించుకొని పొదుపు సభ్యురాలకు ఉప మండల అధ్యక్షులు దువ్వూరు గోపాల్ రెడ్డి



ప్రశంసా పత్రాలను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానమంత్రి మోడీ అమలు చేస్తున్న కేంద్ర ప్రభుత్వ పథకం ద్వారా రూ.లక్ష పెట్టుబడితో పాడి పరిశ్రమ, పలు రకాల కూరగాయలు పండించి ఆర్థిక అభివృద్ధికి అవకాశం ఉంటుందన్నారు. ఏ పథకాన్ని దుర్వినియోగం చేయకుండా, సక్రమంగా సద్వినియోగం చేసుకొని ఆర్థిక ఎదుగుదలకు ఆదర్శంగా నిలవాలని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ అధ్యక్షులు వేమసాని శ్రీనివాసులు నాయుడు, రాజేంద్రప్రసాద్, వెలుగు సిసి చంద్రయ్య, వివోఏలు హాజరయ్యారు.

ఉచిత వైద్య శిబిరం



ప్రజాశక్తి-ఓజిలి: వసంత లక్ష్మి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, డాక్టర్ టి.వసంత లక్ష్మి, రైట్స్ సమస్త మహేష్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఆదివారం నిర్వహించారు. మండల పరిధిలోని ఆరేమినుపాడు గ్రామంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో చిన్నపిల్లల వైద్య నిపుణులు డాక్టర్ సంపత్, గర్భకోశ వ్యాధుల వైద్య నిపుణులు డాక్టర్ విజయ, జనరల్ మెడిసిన్ డాక్టర్ మాలాద్రి వైద్యులతో రోగులకు ఉచిత వైద్య సేవలు అందించారు. వచ్చిన రోగులకు వైద్య సేవలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. బాలింతలకు ప్రత్యేక వైద్య సేవలు అందించి మెడికల్ కిట్టును అందించారు. కార్యక్రమంలో సురేష్, సురేంద్ర, ల్యాబ్ టెక్నీషియన్స్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

'పిల్లలను కలిసేందుకు అవకాశం కల్పించండి'



ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: పుత్తూరు రూరల్ పరిధిలోని గోపాలకృష్ణ పురం వద్ద గల గురుకుల పాఠశాలలో ప్రతి నెల రెండవ ఆదివారం మాత్రమే తల్లిదండ్రులు పిల్లల్ని కలిసేందుకు ప్రభుత్వ నియమ నిబంధనలు మేరకు అనుమతి గలదని ప్రిన్సిపల్ చంద్రకళ పేర్కొన్నారు. తల్లిదండ్రులు ప్రతి ఆదివారం రావడంతో పాఠశాల వద్ద పారిశుద్ధ్య లోపం, ఇబ్బందికర వాతావరణం ఏర్పడుతుందన్నారు. మూడవ ఆదివారం పిల్లలు తల్లిదండ్రులు అధిక సంఖ్యతో రావడంతో ప్రిన్సిపాల్ అనుమతి నిరాకరించారు. గురుకుల పాఠశాలలో చదువుతున్న పిల్లల తల్లిదండ్రులు మరో ఆదివారం అవకాశం కల్పించాలని ప్రిన్సిపాల్‌ని కోరారు. ప్రిన్సిపాల్ సానుకూలంగా స్పందించి ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్లి అవకాశం ఉంటే మరో ఆదివారం పిల్లలను కలిసేందుకు అనుమతి మంజూరు చేస్తామని తెలిపారు.

ముగిసిన అంతరిక్ష దినోత్సవ వారోత్సవాలు

- మొక్కలు నాటిన విద్యార్థులు



ప్రజాశక్తి-గూడూరు టౌన్: గూడూరు పట్టణంలోని డిఆర్‌డబ్ల్యు కళాశాలలో అంతరిక్ష దినోత్సవ వారోత్సవాలు ఆదివారం ఘనంగా ముగిశాయి. ఈ వారోత్సవాల్లో ఏర్పాటు చేసిన అంతరిక్ష విశేషాల చిత్ర ప్రదర్శన ఫోటో ఎగ్జిబిషన్ మూడు రోజుల పాటు ఆసక్తికరంగా సాగింది. ఈ కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన అంతరిక్షంలో మోడీతో సెల్ఫీ కౌంటర్ విద్యార్థులను విశేషంగా ఆకర్షించింది. ప్రతి ఒక్కరూ సెల్ఫీ దిగేందుకు ఆసక్తి చూపించారు. శాస్త్రవేత్తల ఛాయా చిత్రాలతో సాగిన ర్యాలీ భారతదేశ విజయాన్ని కళ్ళకు కట్టింది. గూడూరు ఎమ్మెల్యే, మున్సిపల్ కమిషనర్ సహా కార్యక్రమానికి హాజరైన పలువురు ప్రముఖులు నిర్వాహకులను ప్రశంసించారు. విద్యార్థులకు శాస్త్రసాంకేతిక అంశాల పట్ల అవగాహన కల్పించే విధంగా ప్రదర్శనను ఏర్పాటు చేయటం పట్ల అభినందలు తెలిపారు. చంద్రయాన్-3 విజయం ప్రతి భారతీయుడు గర్వించవలసిన అంశమని అదే సమయంలో భూమి మీద పర్యావరణాన్ని కూడా కాపాడుకోవలసిన అవసరం ఉందని కార్యక్రమానికి విచ్చేసిన వక్తలు అభిప్రాయపడ్డారు. అంతరిక్ష దినోత్సవ ప్రదర్శనలో భాగంగా ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన 'అమ్మ పేరిట ఒక మొక్క సెల్ఫీ బూత్ మరో ఆకర్షణగా నిలిచింది. కార్యక్రమం చివరి రోజున కళాశాల ప్రాంగణంలో మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణ దిశగా పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా భారత ప్రభుత్వ క్షేత్ర ప్రచార అధికారి పరవస్తు నాగసాయి సూరి మాట్లాడుతూ భారత ప్రభుత్వ సమాచార ప్రసార మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ క్షేత్ర కార్యాలయం నెల్లూరు ఆధ్వర్యంలో ఈ ప్రదర్శనను ఏర్పాటు చేయటం జరిగిందన్నారు. సైన్స్ అంటే విద్యార్థుల్లో ఉండే ఆసక్తి మరింత ప్రత్యేకమైనది. ఈ ప్రదర్శన వల్ల వారికి ఎన్నో సందేహాలు తీరాయి అన్నారు. మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా వారిలో మరింత అవగాహన పెంచుతుందన్నారు. ఈ స్ఫూర్తి వారి భవిష్యత్తుకు చక్కని బాటలు వేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కలశాల విద్యార్థులు పాల్గొన్నారు.

ఆచార్య హయగ్రీవ శర్మకి అవార్డు ప్రదానం




ప్రజాశక్తి-క్యాంపస్: ఉత్కర్ష మహోత్సవ కార్యక్రమంలో భాగంగా తిరుపతి నుంచి శ్రీ హయగ్రీవ శర్మకి సంస్కృత భాషకు వారు చేసినటువంటి సేవలకు గాను ఈ ప్రాచ్య విద్యా భూషణ్ అవార్డు, రూ.లక్ష నగదు పురస్కారాన్ని ఢిల్లీలో ఉత్కర్ష మహోత్సవంలో ఇచ్చి సన్మానించడం జరిగింది. ఈయన ఎస్వీయూలో ప్రొఫెసర్‌గా సంస్కృత విభాగంలో పనిచేసి సంస్కృత భాషాభివృద్ధికి కృషి చేసినందుకు అవార్డును ప్రదానం చేశారు. మీమాంస శాస్త్రంలో నిష్ణాతులు ఆచార్య సూర్యనారాయణ భట్‌కి కూడా ప్రాచ్య విద్యా భూషణ్ అనే అవార్డును, రూ.లక్ష నగదు పురస్కారాన్ని విశ్వవిద్యాలయం తరపున ఉత్కర్ష మహోత్సవంలో ఇచ్చి వారిని సన్మానించడం జరిగింది. ఈయన పాండిచ్చేరి ఫ్రెంచ్ ఇన్స్టిట్యూట్లో ఉన్నటు వంటి మ్యాన్ స్క్రిప్ట్ పైన ఈయన విశేష కృషి చేయడం జరిగింది. ఆయన మైసూర్ విశ్వవిద్యాలయంలో కూడా సంస్కృత ఆచార్యులుగా పని చేశారు. సంస్కృతభాషకు ఎవరైతే విశేష కృషి చేస్తూ ఉంటారో, వారికి ప్రతి సంవత్సరం కూడా ఉత్కర్ష మహోత్సవంలో సన్మానిస్తూ వారి ద్వారా మరిన్ని సంస్కృతభాషా అభివృద్ధికి ప్రణాళికలు తయారుచేసి, సంస్కృత భాషను జనభాషగా విశ్వభాషగా చేయడం కొరకు కృషి చేస్తామని వివరించారు.

బొజ్జల వెంకట సుధీర్ రెడ్డిది ఆదర్శ పాలన: మధుబాబు



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకటసుధీర్ రెడ్డిది ఆదర్శ పాలన అని టీడీపీ నేత లక్కమనేని మధుబాబు కొనియాడారు. శ్రీకాళహస్తి పట్టణం పీవీరోడ్డులో గల తన కార్యాలయంలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. సుధీర్ రెడ్డి ఎమ్మెల్యేగా బాధ్యతలు చేపట్టి 65రోజులు అయిన సందర్భంగా ఈ మీడియా సమావేశం ఏర్పాటు చేశామని లక్కమనేని మధు తెలిపారు. ఆయన ఎమ్మెల్యే అయ్యాక శ్రీకాళహస్తీశ్వరస్వామి ఆలయంలో దళారీ వ్యవస్థ పూర్తిగా నియంత్రించారని లక్కమనేని మధుబాబు తెలిపారు. రాజీవ్ నగర్‌ను పూర్తిగా ప్రక్షాళన చేశారన్నారు. తన భార్య కౌన్సిలరుగా ఉన్న సమయంలో రాజీవ్ నగర్‌లో పేదలకు ఇళ్ల స్థలాలు ఇప్పించామనీ, అయితే వైసీపీ హయాంలో ఈ స్థలాలు కొందరు దౌర్జన్యంగా కబ్జా చేశారన్నారు. వైసీపీ హయాంలో కబ్జా అయిన స్థలాలను పైసా ఖర్చు లేకుండా సుమారు 50ప్లాట్లను పేదలకు మళ్లీ ఇప్పించానని గుర్తు చేశారు. ఇక ఇటీవల జరిగిన అధికారుల బదిలీల్లో పైసా వసూలు చేయకుండా పారదర్శకంగా అధికారులను నియమించుకున్నారన్నారు. వైసీపీ హయాంలో అధికారులను బదిలీ చేయాలంటే రూ.లక్షలు వసూలు చేసేవారని ఆయన ఆరోపించారు. మాజీ కౌన్సిలర్ రవీంద్రబాబు, తొట్టంబేడు టీడీపీ నాయకులు ఉన్నం ప్రసాద్, యువ నాయకుడు నవీన్ తదితరులు పాల్గొన్నారు.

పుదుకుప్పం తిరునాళ్ళలో ఎమ్మెల్యే ఆదిమూలం



ప్రజాశక్తి- సత్యవేడు: మండలం లోని పుదుకుప్పం తిరునాళ్ళలో ఆదివారం ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానిక నేతలు, ఆలయ నిర్వాహకులు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికి గజమాలతో సత్కరించారు. అనంతరం స్వామి, అమ్మవార్లను ఎమ్మెల్యే దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ పూజారి, ఎమ్మెల్యేకు తీర్థ ప్రసాదాలు అందించి ఆశీర్వచనాలు పలికారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ఎంసిఎ ఫలితాల్లో ఆర్‌సిఆర్ బిజినెస్ స్కూల్ విద్యార్థుల ప్రతిభ

క్రీడా పోటీల నిర్వహణ అభినందనీయం

● ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్



ప్రజాశక్తి-గూడూరు టౌన్: గూడూరు పట్టణం లోని అల్లూరి ఆదిశేషరెడ్డి ప్రభుత్వ స్టేడియంలో ప్రగతి సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం రాష్ట్ర స్థాయి టిసిఎల్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. ముఖ్య అతిథిగా గూడూరు ఎమ్మెల్యే డాక్టర్ పాశిం సునీల్ కుమార్ విచ్చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ఆరు సంవత్సరాలుగా నిర్విరామంగా ప్రగతి సేవా సంస్థ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు టోర్నమెంట్ నిర్వహిస్తున్నారని తెలిపారు. అదేవిధంగా 6జట్లుతో ప్రారంభమై 19జట్లు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం సంస్థ అధ్యక్షులు కడివేటి చంద్రశేఖర్‌ని అభినందించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా గూడూరు నియోజకవర్గంలో ఉపాధ్యాయులకు టోర్నమెంట్ నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నెలబల్లి భాస్కర్ రెడ్డి, జన విజ్ఞాన వేదిక అధ్యక్షులు వేగూరు రాజేంద్రప్రసాద్, సురేష్ రెడ్డి, అబ్దుల్ రహీం, ముని భాస్కర్, పిడి కరిముల్లా, ఉపాధ్యాయులు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.



బి.రాకేష్ 8.58

ప్రజాశక్తి-క్యాంపస్: తిరుపతి నగరం కరకంబాడి రోడ్డులోని ఆర్‌సిఆర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ అండ్ టెక్నాలజీ కళాశాల విద్యార్థులు ఎంసిఎ మొదటి సెమిస్టర్ పరీక్ష ఫలితాలలో తమ ప్రతిభను చాటారు. ఎస్వీయూ ఆధ్వర్యంలో విడుదల చేసిన పరీక్ష ఫలితాలలో తమ కళాశాల విద్యార్థులు యూనివర్సిటీ పరిధిలో అత్యుత్తమ ఫలితాలను సాధించడం జరిగిందని కళాశాల ప్రిన్సిపాల్, డైరెక్టర్ వి.రవికుమార్ చౌదరి వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో, క్రమ పద్ధతిగా తరగతులకు హాజరై చక్కగా పాఠ్యాంశాలు అవగాహన చేసుకుని, పరీక్షలను చక్కగా రాయడం ద్వారా ఉన్నతమైన గ్రేడ్ ర్యాంకులను సాధించడం జరిగిందన్నారు. బి.రాకేష్ 8.58, ఎ.లక్ష్మి 8.48, ఎ.లోకేష్ 8.46, కె.శ్రావణి 8.43, కె.కిరణ్ కుమార్ 8.40 జిపిఎ గ్రేడ్ మార్కులు సాధించినట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా అత్యధిక జీపీఎ గ్రేడ్ ర్యాంకులు సాధించిన విద్యార్థులకు కళాశాల డైరెక్టర్ వి.రవికుమార్ చౌదరి, కరస్పాండెంట్ ఆర్.శివప్రసాద్ వర్మలు మెరిట్ సర్టిఫికెట్లు, పతకాలను అందించారు. ఉన్నత గ్రేడ్ మార్కులు సాధించిన విద్యార్థులను విభాగాధిపతులు వై.నిరీష, పి.లలిత, అధ్యాపకులు సతీష్, మురళి, మణికంఠలు అభినందించారు.

పరిశ్రమలలో కార్మికులకు రక్షణ కల్పించాలి

● సిఐటియు ఆధ్వర్యంలో కరపత్రాల పంపిణీ

ప్రజాశక్తి-తిరుపతి సిటీ, రేణిగుంట: సిఐటియు జిల్లా అధ్యక్షులు జి.బాలసుబ్రమణ్యం ఆధ్వర్యంలో రేణిగుంట పరిశ్రమల ప్రాంతంలో కార్మికులకు రక్షణ కల్పించాలని కరపత్రాలు పంపిణీ చేశారు. అచ్యుతాపురంలో జరిగిన ఘటన చాలా బాధాకరం, ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో భాగంగా కార్మికుని భద్రతపై జాగ్రత్తలు తీసుకోకుండా యాజమాన్యం నిర్లక్ష్యం వహిస్తుందన్నారు. కార్మికుల శ్రమతో అధిక లాభాలను పొందుతున్న యాజమాన్యం కార్మికుల భద్రతపై చర్యలు తీసుకోవాలి లేని పక్షంలో ప్రమాదాలు జరిగిన పరిశ్రమల యాజమాన్యంపై క్రిమినల్ కేసులు పెట్టాలని అన్నారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యవర్గ సభ్యులు పి.మునిరాజా, రేణిగుంట సిఐటియు అధ్యక్షులు నరసింహారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.



మరపురాని మనిషి శాంతారామ్



నివాళులర్పిస్తున్న పలువురు నాయకులు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: మరపురాని మనిషి శాంతారామ్ జె.పవార్ అని పలువురు వక్తలు అన్నారు. పవార్ 71వ జయంతిని ఆదివారం ద స్కూల్ ఆవరణలో నిర్వహించారు. ఈ సందర్భంగా ద స్కూల్ ఆవరణలో ఉన్న ఆయన శిలావిగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా విచ్చేసిన పలువురు వక్తలు మాట్లాడుతూ సమాజంలో శ్రీకాళహస్తిలో అందరి హృదయాల్లో శాశ్వత స్థానం సాధించిన మిత్రులు శాంతారామ్ జె.పవార్ ఒక్కరే అన్నారు. అలాంటి నాయకుడు ఇక లేడు, రారని అన్నారు. ఆయన జనంతో మమేకమైన తీరు ఎన్నటికీ మరువరానిదని కొనియాడారు. పవార్ కుమార్తె డాక్టర్ అర్చన, ద స్కూల్ కరస్పాండెంట్ జనార్దన్ రావు పవార్, హెచ్ఎం పి.విశాల, పట్టణ ప్రముఖులు గాజుల సత్యనారాయణ, టౌన్ బ్యాంకు చైర్మన్ శెట్టిపల్లి సురేష్, శెట్టిపల్లి సుబ్రహ్మణ్యం, ఆవుల జయరాం, రాము, ప్రతాప్ రావు పవార్, పరమేశ్వరరావు పవార్ తదితరులు పాల్గొన్నారు.